
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నల్లగొండ
5
సోమవారం 3 మార్చి 2025



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.110	170	190
సూర్యాపేట	రూ.125	170	200
నల్లగొండ	రూ.125	170	194

ఉష్ణోగ్రత గరిష్ఠం 34.5 । కనిష్ఠం 18.4



తినాలా? వద్దా?

- చికెన్ ప్రియుల డైలమా
- తగ్గిన చికెన్ కొనుగోళ్లు
- పెరిగిన మటన్, చేపల విక్రయాలు
- కోళ్లకు తగ్గుముఖంపట్టిన వైరస్ లక్షణాలు

ఉమ్మడి జిల్లాలో బర్డ్‌ఫ్లూ లక్షణాలు తగ్గినా చికెన్ తినాలా? వద్దా? అనే డైలమాలో చికెన్ ప్రియులు ఉన్నారు. ఈ నేపథ్యంలో చికెన్ విక్రయాలు తగ్గగా మాంసం ప్రియులు ప్రత్యామ్నాయంగా చేపలు, మటన్ కొనుగోలు చేస్తున్నారు. ఫలితంగా ఉమ్మడి జిల్లాలో చేపలు, మటన్ విక్రయాలు పెరిగాయి. అయితే వీటికి డిమాండ్ పె రగడంతో వ్యాపారులు అమాంతం ధరలు పెంచి విక్రయిస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

రాష్ట్రంతోపాటు సరిహద్దు ఏపీ రాష్ట్రంలోని పలు జిల్లాలో కోళ్లు అకస్మాత్తుగా మృత్యువాత పడటంతో ఉమ్మడి జిల్లాలో సైతం బర్డ్‌ఫ్లూ కలకలం రేగింది. ఖమ్మం, నిజామాబాద్ జిల్లాలో కోళ్లు మృతిచెందడంతో ఆ ప్రభావం ఉమ్మడి నల్లగొండ జిల్లాపై కూడా కనిపించింది. ఉమ్మడి జిల్లాలో వేల సంఖ్యలో కోళ్లు మృతిచెందినా, అవి ఏ కారణాలతో అనేది తొలుత అంతుచిక్కలేదు. ఆ తరువాత చౌటుప్పల్ మండలంలో రాష్ట్రంలోని తొలి బర్డ్‌ఫ్లూ కేసు నమోదైంది. పౌల్ట్రీ రైతులు అప్రమత్తంగా ఉండకపోవడం, కోళ్లు మృతిచెందినా, ఆ విషయాన్ని పశుసంవర్ధకశాఖ అధికారులు, వైద్యుల దృష్టికి తీసుకెళ్లకపోవడంతో ఈ పరిస్థితులు తలెత్తాయి. సంబంధిత కోళ్ల ఫారమ్ యజమానులు, పౌల్ట్రీ రైతులు కోళ్ల ఆరోగ్యాన్ని అంచనా వేయలేకపోయారని, విషయాన్ని తమ దృష్టికి ఆలస్యంగా తీసుకువచ్చారని అధికారులు పేర్కొంటున్నారు.దీనికి తోడు గత నెలా మూడో వారం వరకు కూడా అం టే శివరాత్రి వరకు కనిష్ఠ ఉష్ణోగ్రతలు తక్కువగా ఉండి చల్లటి గాలులు వీయడం కూడా కోళ్ల మరణానికి కారణమని తెలుస్తోంది. ప్రస్తుతం గరిష్ఠ ఉష్ణోగ్రతలు పెరగడంతో కొంత మేర వైరస్ లక్షణాలు తగ్గుముఖం పట్టినట్టు సమాచారం. మార్చిలో ఎండలు 35నుంచి 40డిగ్రీలవరకు ఏప్రిల్,మేలో 45డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలు ఉన్నాయి. ఉష్ణోగ్రతలు పెరగడంతో బర్డ్‌ఫ్లూ వైరస్ లక్షణాలు కనుమరుగయ్యే అవకాశాలు ఉన్నాయి.

చికెన్ ప్రియుల సందేహాలు

బర్డ్‌ఫ్లూ కలకలంతో చికెన్ ప్రియులు డైలమాలో ఉన్నారు. చికెన్ తింటే జబ్బులు వస్తాయనే విషయం వారిని వెంటాడుతోంది. అయితే చికెన్ బాగా ఉడికించి తింటే ఎలాంటి ప్రమాదం లేదని పశు వైద్యులు పేర్కొంటున్నారు. ప్రస్తుతానికి చికెన్ కొనుగోళ్లపై ప్రభావం పడటంతో కోళ్ల...

మిగతా 6వ పేజీలో..





నల్లగొండ జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన కౌంటింగ్ హాల్

ఎమ్మెల్సీ విజేత తేలేది నేడే

హోరాహోరీగా సాగిన శాసనమండలి నల్లగొండ-ఖమ్మం-వరంగల్ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికలో విజేత ఎవరో సోమవారం తేలనుంది. ఈ నియోజకవర్గానికి ఫిబ్రవరి 27న ఎన్నిక జరగ్గా, సోమవారం ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఆర్జాలబావి ప్రాంతంలోని స్టేట్‌వేర్‌హౌసింగ్ గోదాములో ఈ ఓట్ల లెక్కింపు చేపట్టనుండగా, ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి పర్యవేక్షణలో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు.

- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి,నల్లగొండ)

- కౌంటింగ్‌కు పూర్తయిన ఏర్పాట్లు
- ఉదయం 8 నుంచి మొదలవనున్న ప్రక్రియ
- 25 రౌండ్లలో తొలి ప్రాధాన్య ఓట్ల లెక్కింపు
- కోటా ఓటు రాకపోతే ఎలిమినేషన్ పద్ధతిలో ద్వితీయ ప్రాధాన్య ఓట్ల లెక్కింపు



నల్లగొండ-ఖమ్మం-వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలో ప్రధాన ఉపాధ్యాయ సంఘాల అభ్యర్థులు సహా మొత్తం 19 మంది పోటీచేశారు. ఈ ఎన్నికలో మొత్తం 25,797 ఓట్లకు, 93.57 శాతం అంటే 24,139 ఓట్లు పోలయ్యాయి. ప్రాధాన్య క్రమంలో ఓట్ల కేటాయింపు ఉండే ఈ ఎన్నికలో విజేత కావాలంటే 50శాతానికి అదనంగా ఒక్క ఓటు (కోటా ఓటు) రావాలి. అప్పటివరకు ప్రాధాన్య క్రమంలో ఓట్లను లెక్కిస్తారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా కౌంటింగ్ కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటలను జరగకుండా పోలీస్‌యంత్రాంగం భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది.

ఉదయం 8గంటల నుంచి

ఎమ్మెల్సీ ఎన్నికల కౌటింగ్ ప్రక్రియను సోమవారం ఉదయం 8గంటలకే ప్రారంభించనున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇలా త్రిపాఠి తెలిపారు. ఈ మేరకు కౌంటింగ్ సిబ్బందికి ఇప్పటికే శిక్షణ, కౌంటింగ్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అభ్యర్థులు సైతం ఇప్పటికే కౌంటింగ్ ఏజెంట్లను నియమించుకున్నారు. మొదట స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరచిన బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ హాల్‌కు తరలించి ఏజెంట్ల సమక్షంలో బాక్సులను తెరచి బ్యాలెట్ పేపర్లను ఫాం-16 ప్రకారం సరిపోల్చుతూ అన్నింటినీ డ్రమ్ముల్లో వేసి కలిపేస్తారు. మొత్తం 8 రౌండ్లలో ఈ బండిల్స్ కట్టే కార్యక్రమం నిర్వహించి, వాటన్నింటినీ ఆర్‌వో, అభ్యర్థుల సమక్షంలో ఫాం-16తో సరిపోల్చి టేబుళ్లకు పంపిణీ చేస్తారు. ఉదయం 11గంటలవరకు ఈ ప్రక్రియ ముగుస్తుందని భావిస్తున్నారు. వచ్చిన బండిల్స్‌ను 25 టేబుళ్లకు సమానంగా పంపిణీ చేసి కౌంటింగ్ ప్రారంభిస్తారు. మొత్తం 900-950 వరకు బండిళ్లు కానుండడంతో ఒక్కో టేబుల్‌కు 40 చొప్పున కేటాయిస్తూ చివరి టేబుల్‌కు మిగిలిన వాటిని కేటాయిస్తారు. ఆర్వో టేబుల్‌తో పాటు, కౌంటింగ్‌కు 25 టేబుల్స్ ఏర్పాటు చేశారు. ఆర్వో టేబుల్ వద్ద రిటర్నింగ్ అధికారి, సహాయ రిటర్నింగ్ అధికారితో పాటు, అభ్యర్థులు, లేక వారి ప్రధాన ఏజెంట్లు కూర్చుంటారు. కౌంటింగ్ టేబుళ్ల వద్ద ఒక కౌంటింగ్ అధికారి, ఇద్దరు సహాయ కౌంటింగ్ అధికారులు, ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారు. వీరి చుట్టూ 19 మంది అభ్యర్థుల తరుపున ఒక్కో కౌంటింగ్ ఏజెంట్ ఉంటారు. ఒక్కో టేబుల్ వద్ద తొలి ప్రాధాన్య ఓట్ల కౌంటింగ్ పూర్తయ్యాక రిటర్నింగ్ అధికారి ఆమోదించిన తర్వాత ఫలితం ప్రకటిస్తూ వస్తారు. చెల్లని ఓట్లను తొలగిస్తూ చెల్లిన ఓట్లలో తొలిప్రాధాన్య ఓట్లను లెక్కిస్తూ కౌంటింగ్ కొనసాగిస్తారు. మొదటి ప్రాధాన్య ఓట్లు 25 రౌండ్లు పూర్త

య్యేలోపు కోటా ఓటు వస్తే అక్కడితో కౌంటింగ్ నిలిపి విజేతను ప్రకటిస్తారు. మొదటి ప్రాధాన్య ఓట్ల లెక్కింపులో అభ్యర్థులెవరికీ కోటా ఓటు రాకపోతే, ద్వితీయ ప్రాధాన్య ఓట్ల లెక్కింపు చేపడతారు. మొత్తం 19 మంది అభ్యర్థుల్లో అతి తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థుల నుంచి (దిగువ నుంచి) ఒక్కొక్కరిని ఎలిమినేట్ చేస్తూ ద్వితీయ ప్రాధాన్య ఓట్ల లెక్కింపు కొనసాగిస్తారు. కోటా ఓటు వచ్చేంతవరకు ద్వితీయ ప్రాధాన్య ఓట్ల లెక్కింపు కొనసాగుతుంది. ద్వితీయ ప్రాధాన్య ఓట్లలోనూ ఎవరికీ కోటా ఓటు రాకపోతే, తృతీయ ప్రాధాన్య ఓట్లను కూడా లెక్కిస్తారు. దాదాపుగా ద్వితీయ ప్రాధాన్య ఓట్లతోనే ఫలితం తేలుతుందని అంతా అంచనా వేస్తున్నారు.

కౌంటింగ్ కేంద్రం వద్ద భారీ బందోబస్తు

ఎమ్మెల్సీ ఎన్నిక కౌంటింగ్ నేపథ్యంలో ఆర్జాలబావి వద్ద ఏర్పాటు చేసిన కేంద్రం వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. కౌంటింగ్‌కు 250 మంది సిబ్బందిని నియమించారు. మరోవైపు...

మొదటి ప్రాధాన్య ఓట్ల ఫలితం సాయంత్రానికి

కౌంటింగ్ ప్రక్రియ ఉదయం 8గంటలకే మొదలవుతుంది. బ్యాలెట్లను బండిల్స్‌గా మార్చి టేబుళ్లకు కేటాయించే ప్రక్రియ 11 గంటల వరకు ముగుస్తుంది. ఆ తరువాత వరుసగా ఒక్కో టేబుల్ వారీగా ఓట్ల లెక్కింపు మొదలవుతుంది. మొదటి ప్రాధాన్య ఓట్ల లెక్కింపు 11 గంటలకు ప్రారంభిస్తే, సాయంత్రం 3గంటలలోగా పూర్తవుతుంది. అప్పటికీ కోటా ఓటు రాకపోతే, మధ్యాహ్న భోజనవిరామం తర్వాత ద్వితీయ ప్రాధాన్య ఓట్ల లెక్కింపు ప్రారంభిస్తారు. ద్వితీయ ప్రాధాన్య ఓట్ల లెక్కింపు చేయాల్సి వస్తే ఈ ప్రక్రియ అర్ధరాత్రి వరకూ కొనసాగే అవకాశం ఉంది. కోటా ఓటు వచ్చిన వెంటనే కౌంటింగ్‌ను నిలిపి విజేతను ప్రకటిస్తారు. స్వతంత్ర అభ్యర్థులు ఎక్కువగా ఉండడంతో ద్వితీయ ప్రాధాన్య ఓట్ల లెక్కింపు మొదలయితే ప్రక్రియ నిదానంగా కొనసాగుతుందని, దీంతో మంగళవారం తెల్లవారుజామువరకు కౌంటింగ్ కొనసాగే అవకాశముందని అంచనావేస్తున్నారు.

మిగతా 6వ పేజీలో..

సాగర్‌ను తోడేస్తున్నారు

- కుడి, ఎడమ కాలువలకు ఎడా పెడా తరలింపు
- వేసవిలో తాగునీటి కష్టాలు తప్పవంటున్న నిపుణులు
- మూసీలో ఇన్‌ఫ్లో నిల్... అవుట్‌ఫ్లో ఫుల్

నాగార్జునసాగర్ ప్రాజెక్టులో కనీస నీటిమట్టం నిర్వహణ సాధ్యమేనా? అంటే సాగర్ నుంచి ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు కుడి, ఎడమ కాలువలకు తోడివేతను చూస్తే అసాధ్యమే అంటున్నారు నీటి రంగ నిపుణులు. ఈ నీటి సంవత్సరంలో (ఈ ఏడాది జూన్ నుంచి వచ్చే ఏడాది మే వరకు) సాగర్ ప్రాజెక్టు కనీస నీటిమట్టం వరకు తోడుకోవాల్సి ఉండగా కుడి, ఎడమ కాలువలకు ఎడా పెడా తోడేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో నాగార్జునసాగర్ తర్వాత రెండో పెద్ద సాగునీటి వనరుగా ఉన్న మూసీ ప్రాజెక్టు నీటిమట్టం వేగంగా అడుగంటుతోంది.

-(ఆంధ్రజ్యోతి-నాగార్జునసాగర్, కేతేపల్లి)

• 6లో..





ధ్వజారోహణం భేరి పూజ

స్వయంభు యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో బ్రహ్మోత్సవాల రెండో రోజు ఆదివారం ప్రత్యేక పూజలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. అగ్నిప్రతిష్ఠ, ధ్వజారోహణం, దేవతాహ్వానం, భేరిపూజ, హోమాది పూజలను నిర్వహించారు. స్వామివారి తిరుకల్యాణ వేడుకలకు ముక్కోటి దేవతలను ఆహ్వానించేందుకు మహావిష్ణువు ఇష్ట వాహనం గరుత్మంతుడిని ఆహ్వానించేందుకు ధ్వజారోహణం, భేరిపూజ నిర్వహించారు.

-(ఆంధ్రజ్యోతి-యాదగిరిగుట్ట)

• 7లో..

భేరి పూజ నిర్వహిస్తున్న అర్చకులు



గరుడ ముద్దను ఎగురవేస్తున్న అర్చకులు

షూటింగ్ బాల్ సబ్ జూనియర్ ప్రథమస్థానంలో రాష్ట్ర జట్టు



నల్లగొండ జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎన్జీ కళాశాల మైదానంలో నిర్వహించిన సౌత్‌జోన్ షూటింగ్ బాల్ బాలికల సబ్ జూనియర్ విభాగంలో రాష్ట్ర జట్టుకు ప్రథమస్థానం దక్కింది. పలు విభాగాల్లో విజేతలకు షూటింగ్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి జీతురాజ్ తోమర్ బహుమతులు ప్రదానం చేశారు.

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ స్పోర్ట్స్)

• 7లో..

తగలబడుతున్నా పట్టించుకోరా?

- అటవీశాఖకు అందుబాటులోలేని ఆధునిక పరికరాలు
- నాగార్జునసాగర్-శ్రీశైలం అభయారణ్యానికి ఫైర్ ఇంజన్ లేక ఇబ్బందులు
- అడవిలో మంటలు చెలరేగితే చెట్ల కొమ్మలు, మట్టితోనే ఆర్పుతున్న సిబ్బంది
- అటవీశాఖలో సిబ్బంది కొరతతో ఇబ్బందులు
- అదనపు సిబ్బందిని నియమించాలి: రాఘవేంద్ర రావు, సాగర్ అటవీ శాఖ రేంజర్

• 6లో..

నిబంధనల మేరకు బియ్యం ఎగుమతి చేయాలి

కలెక్టర్

హాలియా, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఫిలిప్పిన్స్ దేశంతో ఏర్పాటు చేసుకున్న ఒప్పందం మేరకు నిబంధనల ప్రకారం బియ్యం ఎగుమతి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ఆదివారం హాలియాలోని వజ్రతేజ రైస్ క్లస్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ను ఫిలిప్పిన్స్ దేశ క్వాలిటీ కంట్రోల్ అధికారులతో కలిసి బియ్యం నాణ్యతను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, జిల్లా నుంచి సుమారు వెయ్యి మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఎగుమతి చేసేందుకు పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఆదేశించారన్నారు. మిల్లర్ వేగవంతంగా బియ్యాన్ని ఎగుమతి చేయాలని సూచించారు. ఆమె వెంట అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, డీఎం హరీష్, వజ్రతేజ రైస్ క్లస్టర్ ఎండీ చిట్టిపోలు యాదగిరి, హాలియా మిల్లర్స్ జనరల్ సెక్రటరీ పేలపూడి బాలకృష్ణ, తహసీల్దార్ రఘు, డీటీసీఎస్ ముక్తార్, మిల్లు డైరెక్టర్లు చిట్టిపోలు వెంకటేశ్వర్లు, కుక్కడపు రమేష్, చిట్టిపోలు రంజిత్, కొత్త సుదర్శన్, అసోసియేషన్ మేనేజర్ చిత్తనూరి పవన్‌కుమార్, తదితరులు ఉన్నారు.



బియ్యం నాణ్యతను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఫిలిప్పిన్స్ అధికారులు

మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభావతి

మిర్యాలగూడ, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఐద్వా ఆధ్వర్యంలో నిర్వహించనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి అన్నారు. ఆదివారం మిర్యాలగూడలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పోలెబోయిన వరలక్ష్మితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాల అమలులో విఫలమైందన్నారు. ప్రతీ మహిళలకు రూ.2500 ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయడం లేదన్నారు. కల్యాణలక్ష్మి పథకంలో తులం బంగారం ఇస్తామన్న మాట ఎటు పోయిందని ప్రశ్నించారు. రాష్ట్రంలో మహిళలపై దాడులు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతున్నాయన్నారు. పట్టణాల్లో ఉపాధి పనుల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై రిలే నిరాహార దీక్షలు, ధర్నాలు చేపడ తామన్నారు. ఈ నెల 8న మండల, పట్టణ కేంద్రాల్లో నిర్వహించే మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఐద్వా జిల్లా నాయకులు అరుణ, బీబమ్మ, పూలమ్మ, పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పాలడుగు ప్రభావతి

పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి

డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య

నల్లగొండ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు, ఉపాధ్యాయుల పెండింగ్ డీఏలు, పీఆర్సీ, ఇతర బిల్లులను వెంటనే మంజూరు చేయాలని డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఖుర్షీద్ మియా అధ్యక్షతన నిర్వహించిన వార్షిక కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. 1వ తేదీనే వేతనాలు చెల్లిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా, ఉపాధ్యాయులు, ఉద్యోగులకు సంబంధించిన బిల్లులు ఏళ్లతరబడి ఈ-కుబేర్‌లో పెండింగ్‌లో ఉంటున్నాయన్నారు. ఉద్యోగ విరమణ చేసిన వారికి చెల్లించాల్సి గ్రాట్యుటీ పెండింగ్‌లో ఉంచుతున్నారని, డీఏ, పీఆర్సీ బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. మార్చి నెలతో ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున బిల్లుల రీటోకెన్ చేయకుండా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి భాస్కర్, జిల్లా కార్యదర్శి పి.వెంకులు, ఉపాధ్యక్షుడు ఠాగూర్ కుమార్, గణేష్, వెంకటేశం, నాగయ్య, ఏడుకొండల్, వెంకటేశ్వర్లు, మోహన్‌రావు, అంజయ్య, ఫిరోజ్ దేశ్‌ముఖ్, యాకుబ్ ఆలీ, సైదులు, జగతి, పుష్ప, లక్ష్మయ్య, పాల్గొన్నారు.

సాగర్‌ను తోడేస్తున్నారు

● కుడి, ఎడమ కాలువలకు ఎడా పెడా తరలింపు ● వేసవిలో తాగునీటి కష్టాలు తప్పవంటున్న నిపుణులు



నాగార్జునసాగర్ జలాశయం ప్రస్తుత పరిస్థితి

నాగార్జునసాగర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టులో కనీస నీటిమట్టం నిర్వహణ సాధ్యమేనా? అంటే సాగర్ నుంచి ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు కుడి, ఎడమ కాలువలకు తోడివేతను చూస్తే అసాధ్యమే అంటున్నారు నీటి రంగ నిపుణులు. ఈ నీటి సంవత్సరంలో (ఈ ఏడాది జూన్ నుంచి వచ్చే ఏడాది మే వరకు) సాగర్ ప్రాజెక్టు కనీస నీటిమట్టం వరకు తోడుకోవాల్సి ఉండగా కుడి, ఎడమ కాలువలకు ఎడా పెడా తోడేస్తున్నారు. ఈ సంవత్సరంలో ఎగువ నుంచి సాగర్‌కు మొత్తం 1202.96 టీఎంసీల నీరు వచ్చి చేరింది. దీనిలో కుడి కాలువకు 162.57 టీఎంసీలు, ఎడమ కాలువకు 113.70 టీఎంసీలు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 244.50 టీఎంసీలు విడుదలచేశారు. 626.97 టీఎంసీల నీరు క్రస్ట్ గేట్ల ద్వారా దిగువకు విడుదల చేయడంతో సముద్రం పాలైంది. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు(312.0450టీఎంసీలు) కాగా ప్రస్తుతం 529.20 అడుగులు(166.5892టీఎంసీలు)గా ఉంది. సాగర్ కుడి కాలువ ద్వారా 6,006 క్యూసెక్కుల నీటని, ఎడమ కాలువ ద్వారా 8,896 క్యూసెక్కుల నీటిని, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 12,103 క్యూసెక్కుల నీటిని, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,500 క్యూసెక్కుల నీటిని, వరద కాలువకు 280 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 28,785 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా ఎగువ నుంచి ఎలాంటి నీటి రాక లేదు. సాగర్ నీటి మట్టం కనీస నీటి మట్టానికి (510 అడుగులు) మరో 19 అడుగులు మాత్రమే ఉంది. కనీస నీటి సామర్థ్యానికి (130.8136టీఎంసీలు) మరో 35.7756 టీఎంసీలు మాత్రమే ఉంది. కుడి, ఎడమ కాలువలకు ఎడా పెడా నీటిని తోడేస్తుండడంతో రోజుక ఒక అడుగు (2 టీఎంసీల) చొప్పున సాగర్ నీటి మట్టం తగ్గుతూ వస్తుంది. వేసవి కాలం ప్రారంభానికి ముందే ఇలా సాగర్ నుంచి నీటిని రెండు తెలుగు రాష్ట్రాలు తరలిస్తుంటే ఈ నెల చివరి నాటికి సాగర్ నీటి మట్టం కనిష్టస్థాయికి చేరుకునే అవకాశం ఉందని నీటి రంగ నిపుణులు చెబుతున్నారు. తిరిగి వచ్చే నీటి సంవత్సరానికి మరో మూడు నెలల సమయం ఉండగానే సాగర్ నీటిమట్టం తగ్గితే రెండు తెలుగు రాష్ట్రాలకు తాగునీటి కష్టాలు తప్పవంటున్నారు నిపుణులు. ఇప్పటికైనా తెలుగు రాష్ట్రాలు నీటి నిల్వలను బట్టి నీటి తరలింపును ఆపాలని నిపుణులు కోరుతున్నారు.

ఇన్‌ఫ్లో నిల్... అవుట్‌ఫ్లో ఫుల్



మూసీ జలాశయంలో తగ్గిన నీటిమట్టం

కేతేపల్లి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో నాగార్జునసాగర్ తర్వాత రెండో పెద్ద సాగునీటి వనరుగా ఉన్న మూసీ ప్రాజెక్టు నీటి మట్టం వేగంగా అడుగంటుతోంది. గత ఖరీఫ్‌లో ఎగువ మూసీ ప్రాంతాలు, హైదరాబాద్ నగరంలో విస్తారంగా కురిసిన వర్షాలకు ప్రాజెక్టు పొంగి పొర్లింది. నల్లగొండ-సూర్యాపేట జిల్లాల సరిహద్దుల్లో గల ఈ ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ద్వారా నకిరేకల్, సూర్యాపేట, మిర్యాలగూడ, నల్లగొండ నియోజకవర్గాల్లోని దాదాపు 36వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందిస్తుంది. సూర్యాపేట నియోజకవర్గంలోని చివ్వెంల, పెన్‌పహాడ్ మండలాలు, నకిరేకల్ నియోజకవర్గంలోని కేతేపల్లి మండలం, మిర్యాలగూడెం నియోజకవర్గంలోని వేములపల్లి, మాడ్గులపల్లి, నల్లగొండలోని తిప్పర్తి మండలాల గ్రామాలకు సాగునీరు అందుతుంది. అయితే గత కొన్నేళ్లుగా ఎండలు మండే వేసవిలోనే ఎగువ నుంచి వచ్చే నీటితో నిండుగా ఉంటున్న ఈ ప్రాజెక్టు ఈ ఏడాదిమాత్రం వేసవికి ముందే ఖాళీ అవుతుంది.

10 నెలలపాటు నిరంతరాయంగా..

గత 2024లో ఆయకట్టుకు యాసంగి సాగు నీటి విడుదల నిలిపి వేసిన నాటి నుంచి దాదాపు 10 నెలలపాటు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో నిరంతరాయంగా కొనసాగింది. ఆ తర్వాత ఖరీఫ్‌లో కురిసిన వర్షాలకు ప్రాజెక్టు వరద నీటితో పొంగి పొర్లింది. దీంతో గత వానాకాలం సీజన్‌కు ఆయకట్టులో పంటల సాగుకు గత నవంబరు నెల చివరి వరకు అధికారులు ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలకు నీటిని విడుదల చేశారు. అప్పటికీ ఎగువ నుంచి నిరంతరాయంగా ఇన్‌ఫ్లో ఉండడంతో వరద నీటిని ప్రాజెక్టు క్రస్టుగేట్ల ద్వారా కొంతమేర దిగువ మూసీకి వదులుతూనే కుడి, ఎడమ కాల్వలకు కొద్దిమోతాదులో నీటిని వదులుతూ వచ్చారు. ఆ తర్వాత గత డిసెంబరు 22నుంచి ఆయకట్టుకు 110 రోజులపాటు వారబంధీ పద్ధతిన అధికారులు యాసంగి నీటి విడుదలను చేపట్టారు. ఈ క్రమంలో గత డిసెంబరు 20నుంచి ఈ ఏడాది జనవరి 15వరకు మొదటి విడతగా సాగునీటిని విడుదల చేశారు. ఈ విడతలో ప్రాజెక్టు నీటిమట్టం నాలుగు అడుగుల మేర తగ్గింది. 10 రోజుల విరామంతో గత జనవరి 28న చేసిన రెండో విడత సాగునీటి విడుదల గడువు ఈ నెల 13న ముగియగా దాదాపు 10 రోజుల విరామంతో మూడో విడత సాగునీటిని ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలకు శుక్రవారం విడుదలచేశారు. ఇదిలా ఉంటే ఎగువ నుంచి ఇన్‌ఫ్లో లేకపోవడం, ఆయకట్టుకు మూడో విడత సాగునీటి విడుదల కొనసాగుతుండడంతో ప్రాజెక్టు నీటిమట్టం తగ్గుముఖంపట్టింది. 645 అడుగులు (4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు నుంచి గత డిసెంబరు 20న ఆయకట్టుకు నీటిని విడుదల చేసిన నాడు 644 అడుగులు (4.20టీఎంసీ)లు ఉండగా ఇన్‌ఫ్లో కేవలం 16 క్యూసెక్కులుగా ఉంది. 25 రోజులపాటు సాగిన మొదటి తడి నీటి విడుదల నిలిపి వేసిన జనవరి 15 నాటికి ప్రాజెక్టు నీటిమట్టం నాలుగు అడుగుల మేర తగ్గి 640.45 అడుగులు (3.32 టీఎంసీ)లుగా నమోదుకాగా ఇన్‌ఫ్లో 21.41 క్యూసెక్కులుగా ఉంది. అలాగే 15 రోజులపాటు కొనసాగిన రెండో విడత నీటి విడుదల సందర్భంగా ప్రాజెక్టు నీటిమట్టం నీటిమట్టం మూడున్నర అడుగుల మేర తగ్గిపోయింది. గత 20 రోజుల క్రితం అడపాదడపా వచ్చిన ఇన్‌ఫ్లో సైతం ప్రస్తుతం పూర్తిగా నిలిచిపోయింది. ఆన్ ఆఫ్ పద్ధతిన 110 రోజులపాటు ఆయకట్టుకు నీరు అందించాల్సి ఉండగా, ఇప్పటివరకు 48 రోజులు ఆన్, 20 రోజులు ఆఫ్ కలిపి దాదాపు 68 రోజుల కాలపరిమితి పూర్తయ్యింది. ఈ 68 రోజుల కాలపరిమితిలో ప్రాజెక్టు నీటిమట్టం తొమ్మిది అడుగులకు పైగా తగ్గింది. ప్రస్తుతం మూడో విడత నీటి విడుదల కొనసాగుతుండగా ప్రాజెక్టు నీటిమట్టం 634.18అడుగులు (2.04టీఎంసీ)లుగా ఉంది. ఈ విడత నీటి విడుదల మార్చి 8వ తేదీ వరకు 15 రోజులపాటు కొనసాగనుంది. ఆ తర్వాత సైతం 10 రోజుల విరామంతో ఆయకట్టుకు మరో విడత నీటిని విడుదల చేయాల్సి ఉంది. ప్రస్తుతం వేసవి ఎండలు తీవ్రమవుతుండడంతో ఇప్పటినుంచి పంటలకు నీటి అవసరం ఎక్కువగా ఉంటుంది. ఈ క్రమంలో ఎగువ నుంచి ఇన్‌ఫ్లో లేకపోవడంతో పంటకాలం పూర్తయ్యే నాటికి ప్రాజెక్టు నీటిమట్టం మరో 7నుంచి 8అడుగుల మేర తగ్గి 626అడుగులు (1.12టీఎంసీ)ల కనిష్ఠ స్థాయికి పడిపోనుందన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది.

ఎమ్మెల్సీ విజేత తేలేది నేడే

(5వపేజీ తరువాయి)

పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రం వద్ద బీఎన్ఎస్ 163 సెక్షన్ అమలు చేస్తారు. మొత్తం 530 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రానికి వచ్చే అభ్యర్థుల ప్రధాన ఏజెంట్లు, కౌంటింగ్ ఏజెంట్లు, మీడియా ప్రతినిధులంతా వారికి ఎన్నికల అధికారి జారీచేసిన ఫొటోగుర్తింపు కార్డు వెంట తెచ్చుకోవాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ సూచించారు. కౌంటింగ్ కేంద్రం సమీపంలోనే పార్కింగ్‌కు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. కౌంటింగ్ కేంద్రంలోకి మొబైల్ ఫోన్లు, అగ్గిపెట్టెలు, లైటర్లు, ఇంక్‌బాటిల్స్ లిక్విడ్, వాటర్ బాటిల్స్ ఇతర మండే పదార్థాలను అనుమతించేది లేదని స్పష్టం చేశారు.

విజేత ఎవరనే అంశంపై సర్వత్రా ఆసక్తి

ఈసారి ఎమ్మెల్సీ ఎన్నిక హోరాహోరీగా సాగడంతో ప్రధాన అభ్యర్థులు ఎవరికి వారు గెలుపుపై ధీమాగా ఉన్నారు. ఈ ఎన్నికలో సిట్టింగ్ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి (టీఎస్‌యూటీఎఫ్), పింగళి శ్రీపాల్‌రెడ్డి (పీఆర్‌టీయూటీఎస్), మాజీ ఎమ్మెల్సీ పూలరవీందర్ (బహుజన, బీసీ జేఏసీ), గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి (పీసీసీ అధికార ప్రతినిధి), పులి సర్వోత్తంరెడ్డి (బీజేపీ), సుందర్‌రాజ్‌యాదవ్ (బీసీ సంఘాల మద్దతు) ప్రధానంగా పోటీలో నిలిచారు. మొదటి నలుగురు అభ్యర్థుల నడుమనే తొలి ప్రాధాన్య ఓట్లు చీలాయని, బహుముఖ పోటీసాగడంతో మొదటి ప్రాధాన్య ఓట్లలో మెజార్టీ ఎవరికీ రాకపోవచ్చని ఉపాధ్యాయవర్గాల్లో చర్చ సాగుతోంది. ద్వితీయ ప్రాధాన్య ఓట్లలో ఎలిమినేషన్ ఎంతవరకు కొనసాగుతుంది? ఎలిమినేషన్ అయ్యే అభ్యర్థులకు సంబంధించి మొదటి ప్రాధాన్య ఓట్లేసిన ఓటర్లు ద్వితీయ ప్రాధాన్య ఓటు ఎవరికి వేశారనే అంశంలో కులం, ప్రాంతం, సంఘం ప్రభావం చూపనుండడంతో విజేత ఎవరనే అంశం ఆసక్తికరంగా మారింది.

తినాలా? వద్దా?

(5వపేజీ తరువాయి)

ఫామ్ యజమానులు కొంత మేర నష్టపోయారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 80లక్షలకు పైగా బాయిలర్ కోళ్లు ఉన్నాయి. ప్రధానంగా యాదాద్రి, సూర్యాపేట జిల్లాలో అధికంగా ఉండగా ఆ తరువాత స్థానంలో నల్లగొండ జిల్లాలో కోళ్లఫామ్‌లు ఉన్నాయి. అయితే బర్డ్‌ఫ్లూ నేపథ్యంలో చికెన్ ప్రియులు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. బర్డ్‌ఫ్లూ లక్షణాలు ఏ విధంగా ఉంటాయనే దానిపై కాస్తా గందరగోళంలో ఉన్నారు. కొన్ని కంపెనీలు పలు ప్రాంతాల్లో చికెన్ మేళాలు ఏర్పాటుచేసి ఉచితంగా పంపిణీ చేశాయి. చికెన్ తినడం వల్ల ఎలాంటి ప్రమాదం లేదని కంపెనీలు ప్రజలను చైతన్యం చేసే పనిలో ఉన్నాయి.

మటన్, చేపల కోసం ఎగబడుతున్న జనం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మటన్, చేపల కొనుగోళ్లు పెరిగాయి. చికెన్ తింటే ఏమవుతుందోననే భయంతో ప్రజలు చేపలు, మటన్ కొనుగోళ్లకు మొగ్గుచూపుతున్నారు. కొద్ది రోజల క్రితం వరకు బొచ్చ చేప కిలో రూ.180 ఉండగా, ప్రస్తుతం రూ.240కిలో చొప్పున విక్రయిస్తున్నారు. మటన్ కొద్ది రోజుల క్రితం వరకు కిలో రూ.800ఉండగా ప్రస్తుతం రూ.900 నుంచి రూ.1000కి పెరిగింది. చికెన్ ధరలు స్కిన్‌తో కిలో రూ.170ఉండగా, స్కిన్‌లెస్ రూ.194 వరకు విక్రయిస్తున్నారు. బర్డ్‌ఫ్లూ సమస్య ఉన్నా, చికెన్ ధరల్లో మాత్రం వ్యత్యాసం కొద్దిగానే ఉంది. విక్రయాలపై మాత్రం బర్డ్‌ఫ్లూ ప్రభావం ఉంది. ఇదిలా ఉంటే ఆదివారం రంజాన్ మాసం ప్రారంభమైంది. ఈనెల రోజులు చికెన్ హరీస్‌తో పాటు మటన్ హలీమ్‌ను ఎక్కువగా తింటుంటారు. అయితే బర్డ్‌ఫ్లూ సమస్య ఉండటంతో చికెన్ హరీస్ విక్రయాలపై ప్రభావం ఉంటుందా? అని తయారీదారులు ఆందోళనలో ఉన్నారు. ప్రస్తుతం చికెన్ హరీస్ ధర రూ.140 నుంచి రూ.150 ఉండగా, మటన్ హలీమ్ రూ.200 నుంచి రూ.250వరకు ఉంది.

జిల్లాలో బర్డ్‌ఫ్లూ లక్షణాలు లేవు

జిల్లా వ్యాప్తంగా కోళ్లలో ఎలాంటి బర్డ్‌ఫ్లూ లక్షణాలు లేవు. ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో ఎక్కడైనా వైరస్ ఉన్నా ఆ వైరస్ సున్నితమైనందున చనిపోతుంది. ప్రతీ కోళ్లఫామ్‌ను పశువైద్యులు పరిశీలించారు. కొన్ని ప్రాంతాల్లో కోళ్లు చనిపోయినట్లు సమాచారం ఉన్నా, కోళ్లు అనారోగ్యంగా ఉన్న విషయాన్ని కొంత మంది పౌల్ట్రీ రైతులు ఆలస్యంగా చెబుతున్నారు. అయితే ఎక్కడా బర్డ్‌ఫ్లూ ఉన్న లక్షణాలు కోళ్లలో లేవు. చికెన్‌ను బాగా వేడిచేసి తినడం వల్ల ఎలాంటి ఇబ్బందులు లేవు.

డాక్టర్ జీవి.రమేష్, పశుసంవర్ధకశాఖ జేడీ, నల్లగొండ

నల్లబెల్లం, పటిక పట్టివేత

మద్దిరాల, మార్చి 2(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న 30 క్వింటాళ్ల నల్లబెల్లం, పట్టికను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వీరన్న తెలిపారు. ఆదివారం మద్దిరాల మండల పరిధిలోని మామిళ్లమడవ గ్రామానికి చెందిన షేక్ ఖాదర్, షేక్ మదార్ అన్నదమ్ములు. వీరిద్దరూ కలిసి ప్రభుత్వం నిషేధించిన సారాయి తయారు చేసేందుకు 30క్వింటాళ్ల నల్లబెల్లం, పటికను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చిత్తూరు జిల్లా నుండి బొలేరో వాహనంలో తరలిస్తుండగా పట్టుకున్నామని తెలిపారు. వాహనం సీజ్ చేసి డ్రైవర్ రాజు, ఖాదర్, మదార్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



దగ్ధమవుతున్న నల్లమల అటవీ ప్రాంతం

తగలబడుతున్నా పట్టించుకోరా?

● అటవీశాఖకు అందుబాటులోలేని ఆధునిక పరికరాలు ● నాగార్జునసాగర్-శ్రీశైలం అభయారణ్యానికి ఫైర్ ఇంజన్ లేక ఇబ్బందులు
● అడవిలో మంటలు చెలరేగితే చెట్ల కొమ్మలు, మట్టితోనే అర్పుతున్న సిబ్బంది ● అటవీశాఖలో సిబ్బంది కొరత

నాగార్జునసాగర్, మార్చి2 (ఆంధ్రజ్యోతి): అసలే వేసవి కాలం. ఆపై చెట్ల ఆకులు రాల్చే శిశిర రుతువు కావడంతో అంతా ఎండిపోతోంది. నల్లగొండ జిల్లాలోని నల్లమల అటవీ ప్రాతంలో చెట్ల ఆకులన్నీ రాలడంతోపాటు వానా కాలంలో ఏపుగా పెరిగిన గ్రాసం జనవరి చివరివారంలోనే ఎండిపోయి ఉంది. దీంతో చిన్న నిప్పు రవ్వ పడినా అటవీ ప్రాంతమంతా క్షణాల్లో బుగ్గిపాలవుతోంది. జిల్లాలో మొత్తం 14.25 లక్షల హెక్టార్ల భౌగోళిక విస్తీర్ణం ఉండగా, అందులో 41వేల హెక్టార్లల్లో నల్లమల అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. అందులో అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్, నాగార్జునసాగర్ వన్యప్రాణి విభాగంలో 27,675 హెక్టార్ల నల్లమల అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. నాగార్జునసాగర్ అటవీ విభాగంలో దేవరకొండ, కంబాలపల్లి, నాగార్జునసాగర్ మూడు రేంజ్‌లలో కానుగ, నల్లమద్ది, ఎర్రతుమ్మ, వేప, జామ చెట్లతోపాటు ఏపుగా పెరిగే నాన్‌డ్రా, పిట్టగడ్డి రకం జాతి కూడా ఉంటుంది. ఈగడ్డి వానాకాలం ప్రారంభం నుంచి ఆకుపచ్చగా ఏపుగా పెరుగుతుంది. ఫిబ్రవరి నెల ప్రారంభం అవుతుండగానే ఆ గడ్డి అంతా ఎండిపోతుంది. అడవిలో గొర్రెల కాపర్లు, వేటగాళ్లు, ప్రధాన రహదారి వెంట వెళ్లే వాహనదారులు బీడి, చుట్ట, సిగరెట్ కాల్చి వాటిని పూర్తిగా ఆర్పివేయకుండా పడేస్తుంటారు. దీంతో ఎండిన గడ్డికి వెంటనే నిప్పు అంటుకొని క్షణాల్లో దావానంలా వ్యాపిస్తుంటాయి. ఇలా ప్రతీ వేసవి కాలంలో నల్లమల అటవీప్రాతంలో మంటలు చెలరేగి అడవిలో ఉన్న విలువైన చెట్లు, వన్యప్రాణులు, పక్షులు, జంతువులు అగ్నికి ఆహుతవుతున్నాయి. ఇలా అడవిలో మంటలు చెలరేగినప్పుడు అటవీ శాఖ సిబ్బంది వద్ద ఆధునిక పరికరాలు ఏమి అందుబాటులోలేక పాత పద్ధతిలోనే చెట్ల ఆకులు, ఇసుకతోపాటు తమ వద్ద ఉన్న ఎయిర్ బ్లోయర్లు వాడి నానా ఇబ్బందులు పడి మంటలను అదుపులోకి తెస్తున్నారు. ఈ ఏడాది వేసవి కాలం ప్రారంభానికి ముందే నాగార్జునసాగర్ అటవి పరిధిలో వారం వ్యవధిలో మూడుసార్లు అగ్ని ప్రమాదం జరిగింది. దీంతో సుమారు 300 ఎకరాల్లో గడ్డి, చెట్లు కాలి బూడిదయ్యాయి. మంటలు ఆర్పడానికి ఆధునిక పరికరాలు ఏమి లేకపోవడంతో సిబ్బంది నానా ఇబ్బందులు పడుతూ మంటలను అదుపులోకి తీసుకవచ్చే సరికి వందలాది ఎకరాలకు మంటలు వ్యాపిస్తున్నాయి. ప్రభుత్వం కనీసం అగ్నిమాపక యంత్రం ఏర్పాటు చేయలేకపోవడంతో అడవిని అగ్ని ముప్పు నుంచి కాపాడలేక పోతున్నామని సిబ్బంది ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అటవీ శాఖకు అగ్ని మాపక యంత్రం లేకపోవడమే కాకుండా సాగర్ అటవీ శాఖ కార్యాలయానికి 25కిలో మీటర్ల దూరంలో ఉన్న హాలియాలో, కంబాలపల్లికి 30 కిలో మీటర్ల దూరంలో ఉన్న దేవరకొండలో ఫైర్ స్టేషన్లు ఉన్నాయి. అక్కడినుంచి అడవిలో మంటలు చెలరేగిన ప్రాంతానికి అగ్నిమాపక యంత్రాలు చేరుకునే సరికి వందల ఎకరాల్లో అడవి అగ్నికి ఆహుతి అవుతుందని అటవీ శాఖ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అటవీశాఖలో సిబ్బంది కొరత

నాగార్జునసాగర్ అటవీ శాఖ డివిజన్ పరిధిలో దేవరకొండ, కంబాలపల్లి, నాగార్జునసాగర్ రేంజ్‌లు ఉన్నాయి. అందులో ఒక్కో రేంజ్‌లో నలుగురు ఎఫ్ఎస్‌వోలు ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం ముగ్గురు మాత్రమే ఉన్నారు. అలాగే 12మంది బీట్ ఆఫీసర్లు ఉండాల్సి, ఉండగా కేవలం ఐదుగురు బీట్ ఆఫీసర్లు మాత్రమే ఉన్నారు. దీంతో అడవిలో మంటలు చెలరేగితే ఆర్పడానికి సిబ్బంది సరిపోకపోవడంతోపాటు వారి వద్ద మంటలు ఆర్పడానికి కేవలం ఎయిర్ బ్లోయర్లు, ఫైర్ బీటర్లు, గ్లౌస్‌లు, ఫ్యూజ్‌లు మాత్రమే ఉన్నాయి. అవి కూడా సరిపడ లేకపోవడంతో ఉన్న తక్కువ సిబ్బందిలోనే కొంత మంది మంటలు ఆర్పుతున్నారు. దీంతో మంటలు ఆర్పడం కష్టతరమవుతుంది. సాగర్ రేంజ్‌లో నాలుగు ఎయిర్ బ్లోయర్లుండగా, మిగిలిన రెండు రేంజ్‌లలో కేవలం రెండు బ్లోయర్లు ఉన్నాయి. అలాగే ఫైర్‌బీటర్లు ఒక్కో రేంజ్‌లో రెండు చొప్పున మొత్తం ఆరు ఉన్నాయి. ఫైర్ షూట్ పరికరాలు అసలే లేవు. షూ కూడా ఒక్కో రేంజ్‌లో రెండు జతలు ఉండగా గ్లౌస్‌లు మూడు జతలు మాత్రమే ఉన్నాయి.



మంటలను ఆర్పుతున్న సిబ్బంది

అడవిలో అగ్ని ప్రమాదాల నివారణకు..

- మంటటు చెలరేగి అగ్నికి ఆహుతి కాకుండా ఉండాలంటే మూడు మీటర్లు, ఐదు మీటర్లకు ఒకటి చొప్పున ఫైర్ లైన్స్ ఏర్పాటు చేయాలి
- ఫైర్ లైన్స్ వలన మంటలు కొంత మేరకే నివారించవచ్చు.
- ప్రతి రేంజ్‌లో ఒక ఫైర్ ఇంజన్‌ను ఏర్పాటు చేయాలి.
- ప్రతి రేంజ్‌కు ప్రత్యేకంగా నలుగురు ఫైర్ సిబ్బందిని ఏర్పాటు చేయాలి.
- అడవికి దగ్గరగా ఉన్న గ్రామస్థులు మంటలు అర్పడానికి సహాయపడాలి.
- వేసవి కాలం ప్రారంభం కాగానే ప్రధాన రహదారి వెంట ఉన్న అటవీ ప్రాంతంలో ఎండిన గడ్డిని సిబ్బంది దగ్గర ఉండి కాల్చి వేయాలి.
- అటవికి నిప్పు పెడితే కలిగే అనర్థాలను గ్రామాల్లో ప్రజలకు తెలియజేయాలి.
- గొర్రెల కాపరులు చుట్టలు, , బీడిలు, సిగరెట్లు తాగవద్దని అటవీ శాఖ సిబ్బంది గ్రామాల్లో తెలియపరచాలి.

అదనపు సిబ్బందిని నియమించాలి



నాగార్జునసాగర్ అటవీ శాఖ డివిజన్ పరిధిలో ఉన్న మూడు రేంజ్‌లలో వేసవి కాలంలో అడవిలో మంటలు ఆర్పడానికి అదనంగా ఒక్కో రేంజ్‌లో నలుగురు చొప్పున ఫైర్ సిబ్బందిని నియమించాలి. అంతేకాకుండా మంటలు ఆర్పడానికి నీటిని చిమ్మే డ్రోన్‌లను ఏర్పాటు చేయాలి. ప్రతీ రేంజ్‌కు ఒక ఫైర్ ఇంజన్ ఏర్పాటు చేయాలి.

రాఘవేంద్రరావు, సాగర్ అటవీ శాఖ రేంజర్



ఇంద్రియాల గ్రామంలో మద్యం విక్రయించకూడదని ప్రతిజ్ఞ చేస్తున్న గ్రామస్థులు

ఇంద్రియాలలో మద్యం బంద్.. విక్రయిస్తే రూ.25వేల జరిమానా

● సమాచారం ఇచ్చిన వారికి రూ. 5వేలు బహుమానం ● బెల్టు షాపులను నిషేదిస్తూ ఇంద్రియాల గ్రామస్థుల తీర్మానం

భూదాన్‌పోచంపల్లి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి పరిధిలోని ఇంద్రియాలలో మద్యం విక్రయాలు నిషేదిస్తూ కీలక నిర్ణయాలు తీసుకుని గ్రామస్థులు ఆదివారం ఏకగ్రీవంగా తీర్మానంచేశారు. గ్రామంలో అనేక గొడవలకు మద్యం కారణమవుతున్నందున గ్రామస్థులు, అఖిలపక్షం నేతలు సమావేశమయ్యారు. ఇకపై గ్రామంలో బెల్టు షాపులు ఉండకూడదని తీర్మానం చేశారు. ఈ మేరకు అందరూ ప్రతిజ్ఞచేశారు. గ్రామంలో ఎవరైనా మద్యం విక్రయిస్తే వారికి రూ.25వేలు జరిమానా, విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందిస్తే వారికి రూ.5వేలు బహుమతిని ప్రకటించారు. గ్రామంలో సంపూర్ణ మద్య నిషేదం అమలుచేయాలని తీర్మానించారు. గ్రామంలో బెల్టు షాపులు నిషేదించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

అడ్డగూడూరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని మహిళ (45) మృతి చెందిన ఘటన ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలంలోని కంచనపల్లి గ్రామ శివారులో జరిగింది. ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. కంచనపల్లి గ్రామశివారులోని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మహిళ తలకు తీవ్ర గాయంకావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు గ్రామస్థులు పోలీసులకు తెలిపారు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహన్ని పంచానామా నిర్వహించి, కేసు నమోదు చేసి మృతదేహన్ని రామన్నపేట ఏరియా ఆసుప్రతికి తరలించినట్లు తెలిపారు.

ఒకరికి గాయాలు ..



భువనగిరి రూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన యాదాద్రి భువనగిరి జిల్లాకేంద్రం శివారులో మాసుకుంట వద్ద ఆదివారం జరిగింది. స్థానికుల వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని బస్వాపురం గ్రామానికి చెందిన వర్రె సాయిలు రాయిగిరిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో వివాహానికి హాజరై మోటార్ సైకిల్‌పై తిరిగి వెళ్తుండగా మార్గమధ్యలోని మాసుకుంట రాగానే.., వెనుక నుంచి ఓ కారును ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌లో జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని స్థానిక వైద్యులు తెలపడంతో మెరుగైన వైద్య చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు. ఈ విషయమై ఎలాంటి ఫిర్యాదు అందలేదని భువనగిరి రూరల్ ఎస్ఐ వి.సంతోష్‌కుమార్ తెలిపారు.

వాట్సప్ పరిచయం.. ఆ తర్వాత ప్రేమ

● మోత్కూరులో ఉరేసుకొని మైనర్ ఆత్మహత్య

మోత్కూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మోత్కూరు మండల కేంద్రంలో అగస్య ఆస్పత్రిపైన ఓ గదిలో అద్దెకు ఉంటున్న కృష్ణా జిల్లా కొడాలికి చెందిన మైనర్ ఆదివారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు, పట్టణ వాసుల కథనం ప్రకారం... వాట్సాప్ ద్వారా మోత్కూరుకు చెందిన ఓ యువకుడితో పరిచయం ఏర్పడి, అది కాస్త ప్రేమగా మారినట్లు తెలుస్తోంది. యువకుడి తల్లిదండ్రులు వారి వివాహానికి అంగీకరించకపోవడంతో వారిద్దరు మోత్కూరులో ఓ గది అద్దెకు తీసుకుని గత డిసెంబరు నుంచి కలిసి ఉంటున్నారు. డీజే ఆపరేటర్‌గా పని చేస్తున్న ఆ యువకుడు ఆదివారం హైదరాబాదు వెళ్లగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందంటున్నారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ డి.నాగరాజు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. పోలీసులకు మృతిరాలి వద్ద సూసైడ్ నోటు లభించినట్లు తెలుస్తోంది. ఆమె ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని మృతురాలి తల్లిదండ్రులకు, ఆమెతో కలిసి ఉంటున్న యువకునికి సమాచారం ఇచ్చామని, వారు వస్తేనే ఆత్మహత్యకు గల కారణాలేమిటన్నది తెలుస్తాయని ఎస్ఐ తెలిపారు.

బాలికపై అత్యాచారయత్నం

అనంతగిరి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని అమీనబాద్ గ్రామానికి చెందిన పదేళ్ల బాలికపై అదే గ్రామానికి చెందిన వ్యక్తి అత్యాచారయత్నానికి ప్రయత్నించాడు. నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నవీన్‌కుమార్ ఆదివారం తెలిపారు. సుమారు 30 ఏళ్ల వ్యక్తి కొంతకాలంగా బాలికను లైగింక వేధింపులకు గురి చేస్తుండడంతో బాలిక బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇసుక లారీల పట్టివేత

కోదాడ రూరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు లారీలను పట్టుకున్నట్లు సూర్యాపేట జిల్లా కోదాడ రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపారు. లారీ డ్రైవర్లు చిక్కుల రాజేష్, పెనరవల్లి మరియదాస్‌లు ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకను నందిగామ పక్కన మసీరు వాగు నుంచి కోదాడకు తరలిస్తున్నారు. ఆదివారం ఉదయం 6 గంటల సమయంలో పట్టుకున్నట్లు తెలిపారు. లారీ డ్రైవర్లు, ఓనర్లపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఎస్ఐ అనిల్‌రెడ్డి మాట్లాడుతూ అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే కేసులు నమోదు చేయడంతోపాటు కఠిన చర్యలు ఉంటాయన్నారు.

ధ్వజారోహణం.. దేవతాహ్వానం

యాదగిరిగుట్ట బ్రహ్మోత్సవాల్లో రెండోరోజు



గరుడ చిత్రపటాన్ని ధ్వజస్తంభం వద్దకు తీసుకొస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, మార్చి 2(ఆంధ్రజ్యోతి): స్వయంభూ యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో ఉత్సవ సంరంభం నెలకొంది. ప్రధానాలయంలో కొలువై భక్తులకు దర్శనమిస్తున్న స్వామివారి వేడుకల్లో అర్చకులు, వేదపండితులు, రుత్వికులు శ్రీకారం చుట్టారు. అగ్నిప్రతిష్ఠ, ధ్వజారోహణం, దేవతాహ్వానం, హోమాది పూజలు, రుత్వికుల పారాయణాలతో బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు ఆదివారం ఆగమశాస్త్రరీతిలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి తిరుకల్యాణ వేడుకలకు ముక్కోటి దేవతలను ఆహ్వానించేందుకు మహావిష్ణువు ఇష్ట వాహనం గరుత్మంతుడిని ఆహ్వానించేందుకు జరిపే తంతే ఈ ధ్వజారోహణం. గరుడాళ్వార్ల చిత్రపటం వద్ద పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు, వజ్రవైడూర్యాలతో అలంకరించిన లక్ష్మీనరసింహులను ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేసి వేదమంత్రాలతో దేవతలను అర్చించి గరుత్మంతుడి పటాన్ని శ్వేత ధ్వజపతాకంపై చిత్రించారు. వేద మంత్రాలు, మంగళవాయిద్యాల మధ్యన గరుడ పతాకాన్ని ధ్వజస్తంభంపైకి ఆరోహణ చేశారు. కార్యక్రమం అర్చకులు, పండితుల వేద, మంత్రోచ్ఛారణలు, నాదస్వర సప్త స్వరాగాల మధ్య సాగింది. ఈ సందర్భంగా గరుత్మంతుడిని ఆహ్వానించేందుకు గరుడ ముద్దలను ఎగురవేశారు. గరుడ ప్రసాదం స్వీకరిస్తే సౌభాగ్యం, సంతాన ప్రాప్తి కలుగుతుందని గరుడ ముద్దల ప్రసాదాన్ని భక్తిభావంతో భక్తులు స్వీకరించారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం నుంచి స్వామివారి అలంకార సేవలు ప్రారంభం కానున్నాయి. ఉదయం దివ్యఅవతార అలంకా రం, రాత్రి విశేష వాహన సేవలో స్వామివారు పూజలు అందుకుంటారు. వేద పారాయణాలు ప్రారంభిస్తారు.

ధ్వజారోహణం ప్రత్యేకత

నూతన తెల్లటి వస్త్రంపై గరుడను చిత్రించి 27 విధములైన ఉపచారములతో పూజలు చేపట్టి గరుడగద్యం, విష్ణు గద్యాదులు, గీత తాళ లయాత్మకంగా పఠిస్తూ ధ్వజస్థంభంపై ధ్వజపటాన్ని అలంకరించారు. గరుడమూర్తికి ముద్దలను నివేదించి సంతాన లేని మహిళ భక్తులు ఆ ప్రసాదాన్ని స్వీకరిస్తే సంతానం కలుగుతోందని ఆర్యోక్తి. ధ్వజపటాన్ని ధ్వజ స్తంభానికి అలంకరించి సకల దేవకోటి, ప్రాణకోటిని ఉత్సవాలకు ఆహ్వానించే ప్రక్రియే ధ్వజారోహణం.

ఛత్రీలు అందజేత

స్వామివారి తిరువీధి సేవలో వినియోగించే ఛత్రీలు హైదరాబాద్‌కు చెందిన కందుల సురేందర్ దంపతులు ఆలయ అనువంశిక ధర్మకర్త భాస్కరాయణీ నరసింహమూర్తి, డీఈవో దోర్బల భాస్కరశర్మ, ఏఈవో ప్రతాప నవీన్‌కుమార్ శర్మ, పర్యవేక్షకుడు నాగుల మహేష్‌గౌడ్‌కు అందజేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నీలిమ ఆసుపత్రి (ఘట్‌కేసర్) కొండపైన ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ నెల 11 వరకు నిత్యం ఉదయం 10నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

దివ్య అలంకరణలో ఆత్రేయుడు


యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారు అలంకార ప్రియుడు. అంతటి మహిమాన్వితమైన అలంకారాలను వారసత్వ వృత్తిగా స్వీకరించి ఎన్నో సుప్రసిద్ధ దేవాలయాలల్లో వైవిధ్యమైన అలం కరణలతో అటు పరమాత్ముడిని, ఇటు భక్తజనులను పరవశింపజేస్తున్నాడు. హైదరాబాద్ చార్మినార్‌కు చెందిన శృంగార ఆత్రేయాచార్యులు దేవత మూర్తుల అలంకరణలో దిట్ట. వారసత్వంగా తన తాత శృంగారం కృష్ణమాచార్యులు, తండ్రి శృంగారం రమణాచార్యుల వద్ద శిష్యరికం చేసిన ఆయన తన 18వ ఏటి నుంచే పలు దేవాలయాల్లో జరిగే మహోత్సవాల్లో ఉత్సవ మూర్తులను వివిధ అవ



తారాలలో అలంకరణలు చేస్తున్నారు. అధునిక కాలంలో అలంకరణ వృత్తి పట్ల నిబద్ధతతో దేవతామూర్తులను వైవిధ్య భరితంగా అలంకరించి భక్తులను మంత్రముగ్ధులను చేయడంలో ఆయన పసిద్ధి. తెలుగు రాష్టాల లోనే కాకుండా కర్ణాటక, కేరళ, తమిళనాడు, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో పలు దేవాలయాల్లో జరిగే విశేషోత్సవాలకు అలంకారస్వామిగా ఆహ్వానం మేరకు అలంకరణ బాధ్యతలు స్వీకరిస్తారు. బ్రహ్మోత్సవాలు, దేవీ నవరాత్రోత్సవాలు, శ్రీ కృష్ణలీలలు, దశావతారాలు ఇలా ఎన్నో రకాలుగా స్వామి, అమ్మవార్లను అలంకరిస్తూ భక్తులను పరవశింపజేస్తున్నారు. యాదగిరిగుట్ట వార్షిక బ్రహ్మోత్సవాలలో స్వామివారి అలంకార విశిష్టతలను, వైభవాన్ని అలంకరణతో వివరిస్తూ భక్తుల ఆదరాభిమానాన్ని చూరగొంటున్నారు.



అందరూ స్వామి పాద సేవకులే



స్వామిసేవలో తొలి రాష్ట్రపతి బాబు రాజేంద్రప్రసాద్ (ఫైల్)

విశ్వక్షేత్రంగా విరాజిల్లుతూ.. భక్తుల పాలిట కొంగు బంగారంగా విలసిల్లుతున్న యాదగిరిగుట్ట క్షేత్ర చారిత్రాత్మక నేపథ్యం ఎంతో వైభవంగా సాగింది. అందరూ స్వామివారికి పాద సేవకులు కావడం విశేషం. ఎందరో రాజులు.. మహారాజులు యాదగిరిపై స్వామివారిని కొలిచి తమ అభీష్టాలు నెరవేర్చుకున్నట్టు శాసన ఆధారాల ద్వారా తెలుస్తోంది. రాజు త్రిభువన మల్లుడు 12వ శతాబ్దిలోనే ఈ క్షేత్రాన్ని సందర్శించినట్లు భువనగిరి కోటలోని శాసనాల ద్వారా తెలుస్తోంది. ఆ తర్వాత కాకతీయ గణపతి రాజులు, 15 శతాబ్దంలో శ్రీకష్ణదేవ రాయలు కూడా ఈ ఆలయాన్ని దర్శించి పూజలు జరిపినట్టు ఆయన తన జీవిత చరిత్ర గ్రంథంలో ప్రస్తుతించారు. కాగా, కుల, మతాలకతీతంగా సాధారణ భక్తులు కూడా స్వామివారిని దర్శించి తరించినోళ్లే. స్వయంభూ క్షేత్రమైన ఈ ఆలయం పరిసరాలు ఒక్కప్పుడు కీకారణ్యంగా ఉండేది. ఇక్కడ నిత్యపూజలు జరపడానికి భక్తులు బృందాలుగా డప్పు చప్పుల్లు జయధ్వానాలు చేస్తూ కాగడాల వెలుగుల మధ్య ఊరేగింపుగా కొం డపైకి వెళ్లి శ్రీస్వామి వారికి పూజాది కైంకర్యాలు, నైవేద్యాలు సమర్పించేవారు. ఈ క్షేత్రంలో స్వామివారికి నిత్య పూజలు ప్రారంభమై శతాబ్దాలు గడిచాయి. ఈ క్షేత్ర అభివృద్ధికి హిందూ రాజులే కాకుండా ఇస్లాం మతస్థులు కూడా పూజలు నిర్వహించినట్లు దాఖలాలు ఉన్నాయి. కొండపైకి మొదటి ఘాట్ రోడ్డును నిజాం ప్రభుత్వ హ యాంలోనే నిర్మించారు. ఈ పుణ్య క్షేత్రం గ ల పట్టణం యా దగిరిగుట్ట నిజాం సంస్థానాధీశుడైన సర్ సాలార్జంగ్ ఆధీనంలో పరిపాలించారు.

ప్రముఖుల సందర్శన



స్వర్గీయ మాజీ రాష్ట్రపతి శంకర్‌దయాళ్ శర్మకు పూర్ణకుంభ స్వాగతం పలుకుతున్న అర్చకులు

1958 సంవత్సరంలో తొలి మాజీ రాష్ట్రపతి డాక్టర్ బాబు రాజేంద్ర ప్రసాద్, సర్వేపల్లి రాధక్రిష్ణన్, వీవీ. గిరి, శంకర్ దయాళ్ శర్మ, ప్రణబ్ ముఖర్జీ, తాజా ద్రౌపది ముర్ము, రాష్ట్ర దేవాదాయ శాఖ తొలిమంత్రిగా(మాజీ ప్రధాని) దివంగత పీవీ నరసింహారావు, సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ, మాజీ గవర్నర్లు ఎల్.ఎస్ నరసింహన్, తమిళసై సుందర్ రాజన్, ప్రస్తుత గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ యాదగిరిగుట్ట దివ్యక్షేత్రాన్ని సందర్శించినోళ్లే. అలాగే దివంగత ముఖ్యమంత్రులు మర్రి చెన్నారెడ్డి, వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి, కొణిజేటి రోశయ్య, మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి స్వామివారిని దర్శించుకునోళ్లే. గర్భగుడిలో తొలి రాష్ట్రపతి ఆసీనులు కాగా పీవీకి అప్పటి ఆలయ ప్రధానార్చకులు మరింగంటి రామానుజాచార్యులు, అర్చకులు సందుగుల కృష్ణమాచార్యులు, అప్పటి ఆలయ ఈవో యాలాల బస్వయ్య పూర్ణకుంభ స్వాగతం పలుకుతున్న అరుదైన అపురూప పాత చిత్రం. అలాగే మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ క్షేత్ర పర్యటనకు వచ్చినప్పుడు తెలంగాణ తొలి మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు స్వామివారి మెమొంటోను అందజేశారు. అలాగే మాజీ సీఎం కేసీఆర్ 21 మార్లు తాజా సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి మూడుమార్లు క్షేత్రాన్ని సందర్శించారు.

లక్ష్మీనృసింహుడి అలంకార సేవల విశిష్టత

యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడి వార్షిక బ్రహ్మోత్సవ వేడుకలు నవాహ్నిక ఏక కుండాత్మకంగా పాంచరాత్రాగమ శాస్త్ర ప్రకారం కొనసాగుతాయి వైష్ణవ దేవాలయాల్లో బ్రహ్మోత్సవాలు, అధ్యయనోత్సవాలు, విశేష పర్వదినాలలో భగవానుని దశావతారాలలో, వివిధ వాహనసేవల్లో అలంకరించడం అనాదిగా వస్తున్న ఆచారం. ఇక్కడ స్వామివారి వివిధ వాహన సేవల్లో దశావతారాలు ధరించి భక్తులను తరింపజేస్తారు. పట్టుపీతాంబరాలు, బంగారు ముత్యాలు, వజ్రవైఢూర్యాలలో లక్ష్మీనృసింహుడిని దివ్యమనోహరంగా అలంకరణలు చేపట్టి ఉదయం, సాయంత్రం తిరువీధుల్లో ఊరేస్తారు. భక్తి ప్రపత్తులతో భక్తుల జయజయధ్వానాలు, వేద మంత్ర పఠనాలు, ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాల నడుమ ఊరేగించి స్వామిని ఆనందింపజేయడమే అలంకారసేవ పరమార్థం. ఆనందపరవశుడైన శ్రీమన్నారాయణుడు యావత్ భక్తజనుల కామితాలను ఈడేర్చుతాడని పురాణోక్తి. పరమాత్ముడు భక్తజనావళిని కటాక్షించేందుకే ఉత్సవాల సమయంలో అలంకార సేవలను శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాలలో స్వామివారు దశావతారాలను ధరించి భక్తజన కోటిని కాటాక్షిస్తున్నాడు. ఏటా జరిగే వార్షిక బ్రహ్మోత్సవల్లో మూడో రోజు నుంచి మొదలయ్యే ఉదయం మత్స్యావతారం రాత్రి శేష వాహన సేవ, నాలుగవ రోజు వటపత్రశాయి (హంస వాహన సేవ), ఐదో రోజు శ్రీ కృష్ణా (మురళీ కృష్ణుడు) పొన్న వాహన సేవ, ఆరవ రోజు గోవర్ధనగిరిధారి (సింహ వాహన సేవ), ఏడో రోజు జగన్మోహిని అలంకరణ, రాత్రి ఎదుర్కోళ్లోత్సం (అశ్వ వాహన సేవ), ఎనిమిదవ రోజు శ్రీ రామ (హనుమంత వాహన సేవ), రాత్రి గజ వాహన సేవలో తిరుకల్యాణోత్సవం, తొమ్మిదవ రోజు శ్రీ మహా విష్ణువు (గరుడ వాహన సేవ) అలంకరణలో స్వామి వారు భక్తులకు దర్శినమిస్తారు. కాగా సాయిపావని కన్‌స్ట్రక్షన్ రూ.12 లక్షలతో స్వామివారి శేష వాహనం, గార్లపాటి యాదయ్య రామలింగేశ్వరీ దంపతులు రూ.12లక్షలతో గరుడ వాహనంతో పాటు అనురాధ టింబర్ డిపో రూ.4లక్షలతో సేవ పీటకు సుమారు 4.500కిలోల బంగారంతో తాపడం పనులు పూర్తయ్యాయి. వీటిని బ్రహ్మోత్సవ సేవలో వినియోగిస్తారు.



అలరించిన గరికపాటి ప్రవచనాలు



యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో సహస్రావధాని, పద్మశ్రీ, డాక్టర్ గరికపాటి నరసింహరావు రెండో రోజు ఆదివారం కొండపైన ప్రవచనాలు చేశారు. ప్రవచనాలు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఎర్రప్రగడ రచించిన నృసింహ వైభవం ప్రవచించారు.

షూటింగ్ బాల్

క్రీడను బలోపేతం చేయాలి

- షూటింగ్ బాల్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి జీతురాజ్ తోమర్
- విజేతలకు బహుమతుల ప్రదానం



సీనియర్ బాలికల విభాగంలో ప్రథమ బహుమతి అందుకుంటున్న గోవా జట్టు

నల్లగొండ స్పోర్ట్స్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): షూటింగ్ బాల్ క్రీడను గ్రామీణ స్థాయి నుంచి బలోపేతం చేయాలని షూటింగ్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి జీతురాజ్ తోమర్ అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎన్‌జీ కళాశాల మైదానంలో నల్లగొండ జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 4వ సౌత్‌జోన్ షూటింగ్ బాల్ జూనియర్, సీనియర్ బాల బాలికల క్రీడా పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విజేతలకు పతకాలు, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని అన్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తే విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ సౌకర్యం ఉంటుందన్నారు. షూటింగ్ బాల్ క్రీడను గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు, యువకులకు పరిచయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ పోటీల్లో ఆరు రాష్ట్రాల నుంచి 36 జట్లు పాల్గొని క్రీడా ప్రతిభను ప్రదర్శించినట్లు తెలిపారు. అంతకుముందు జరిగిన జూనియర్, సీనియర్ బాల బాలికల ఫైనల్ మ్యాచ్‌లో సీనియర్ బాలికల విభాగంలో ప్రథమస్థానంలో గోవా, ద్వితీయ స్థానంలో తెలంగాణ, తృతీయ స్థానంలో కేరళ జట్లు నిలిచాయి. బాలుర విభాగంలో ప్రథమ ఆంధ్రప్రదేశ్, ద్వితీయ తెలంగాణ, తృతీయ కేరళ జట్టు నిలిచింది. జూనియర్ బాలికల విభాగంలో ప్రథమస్థానంలో కర్ణాటక, ద్వితీయ తెలంగాణ, తృతీయస్థానంలో ఆంధ్రప్రదేశ్ జట్టు నిలిచింది. బాలుర విభాగంలో ప్రథమస్థానంలో ఆంధ్రప్రదేశ్, ద్వితీయ కేరళ, తృతీయ స్థానంలో తెలంగాణ జట్లు నిలిచాయి. సబ్‌జూనియర్ బాలికల విభాగంలో ప్రథమ తెలంగాణ, ద్వితీయ కర్ణాటక, తృతీయ స్థానంలో ఆంధ్రప్రదేశ్ నిలిచాయి. బాలుర విభాగంలో ప్రథమ తెలంగాణ, ద్వితీయ ఆంధ్రప్రదేశ్, తృతీయ కర్ణాటక జట్లు నిలిచాయి. కార్యక్రమంలో తెలంగాణ షూటింగ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి సీహెచ్.ఐలయ్య, నల్లగొండ చైర్మన్ డాక్టర్ ఓరుగంటి శ్రీనివాస్, అధ్యక్షుడు నాగేంద్ర భూషణ్, కార్యదర్శి కందికట్ల రజితదాసు, డాక్టర్ పుల్లారావు, శంభలింగం, కోచ్‌లు, మేనేజర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై కేసు నమోదు

నకిరేకల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి కందుల సోమయ్యపై దాడి చేసిన టీచర్ పార్థసారథిపై కేసు నమోదు చేసినట్లు నకిరేకల్ సీఐ రాజశేఖర్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకల్ పట్టణంలోని తెలంగాణ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయాన్ని గతంలో టీచర్లు పార్థసారధి, సదానందంగౌడ్ కలిసి భుజంగరావు అనే వ్యక్తిపై రిజిస్ట్రేషన్ చేయించారు. ఆ విషయంపై కందుల సోమయ్య హైకోర్టులో పిటీషన్ వేసి రద్దు చేయించారు. ఆ కోపంతో పార్థసారథి శనివారం సాయంత్రం ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన కార్యక్రమంలో కందుల సోమయ్యపై దాడి చేసినందుకు ఆయన ఫిర్యాదు మేరకు పార్థసారథిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ప్రశాంతంగా ముగిసిన మహాశివరాత్రి జాతర

- చివరి రోజు పోటెత్తిన భక్తులు • ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పద్మావతి

మేళ్లచెర్వు, మార్చి2(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా మండలకేంద్రంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న జాతర ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. జాతరలో ఐదు లక్షల మంది భక్తులు పాల్గొనగా చివరి రోజు ఆదివారం ఒక్కరోజే రెండు లక్షల మంది భక్తులు పాల్గొన్నారు. చివరి రోజు ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సీనియర్ విభాగపు ఎద్దుల పోటీలను తిలకించడానికి భారీ స్థాయిలో రైతులు, పశుపోషకులు హాజరయ్యారు. ముగింపు రోజు ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన ఎద్దుల పోటీలను, కబడ్డీ పోటీలను కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పద్మావతి మాట్లాడుతూ ఐదు రోజుల జాతరను విజయవంతం చేసిన అన్ని శాఖల అధి కారులు, ఆలయ సిబ్బందికి, ధన్యవాదాలు తెలిపారు. మేళ్లచెర్వు జాతర అంటే తమకు ఎంతో ప్రత్యేకత అని, తనకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి స్వామి వారి సేవలో పాల్గొనటం అత్యంత ప్రీతికరమని ఆలయ అభివృద్ధికి గతంలో అనేక కృషి చేసిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గతేడాది, ఈ సంవత్సరం జాతర అభివృద్ధి కోసం రూ. కోటి మంజూరు చేశారన్నారు. భవి ష్యత్తులో ఆలయ పరిసర ప్రాంతాల్లో పొలాలు ఇళ్ల స్థలాలు మారుతున్నందన, భవిష్యత్తు ఉత్సవాలు, అవసరాల కోసం ఆలయ విస్తీర్ణతకు అవసరమగు స్థల సేకరణకు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రతిపాదనలు తీసుకొని వస్తే మంత్రి ఉత్తమ చొరవతో ఆలయ ప్రాంత విస్తీర్ణకు కృషిచేస్తానని వచ్చే మహా శివరాత్రి జాతరను మరింత ఉత్సాహవంతంగా చేసుకోవాలని కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి తెలిపారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా.. ఆలయ అధికారులు, సిబ్బంది, అర్చకులు, ఆలయ మర్యా దలతో స్వాగతం పలికి స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు.

పశుపోషకులను ప్రోత్సాహించడానికే బహుమతులు

మహాశివరాత్రి జాతర సందర్భంగా ఏర్పాటుచేసే ఒంగోలు జాతి ఎద్దుల పోటీల్లో సీనియర్ విభాగంలో గెలుపొందిన జతలకు ఐదేళ్లగా ట్రాక్టర్‌ను బహూకరిస్తున్నామని ఐరా రియల్టీ అధినేత మేళ్లచెర్వు గ్రామ వాసి పోషం నర్సిరెడ్డి తెలిపారు. పశు పోష కులను ప్రోత్సాహించడానికి, భవిష్యత్తులో జాతర అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు.

భక్తిశ్రద్ధలతో పూర్ణాహుతి

ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయ సుప్రభాత సేవ, స్వామి వారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించిన అర్చ కులు జాతర ముగింపు ఉత్సవాల్లో భాగంగా పూర్ణాహుతి వసంతోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ శాగంరెడ్డి శంభిరెడ్డి, ఈవో కొండారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, పోషం నర్సిరెడ్డి, మాజీ ఎంపీపీ కొట్టె పద్మాసైదేశ్వరరావు, మాజీ జడ్పీటీసీ పద్మ గోవింద రెడ్డి, కొండారెడ్డి, రామకృష్ణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రామకృష్ణ, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.



సీనియర్ విభాగంలో పాల్గొన్న ఒంగోలు గిత్తలు



ఉత్సవ విగ్రహాలు తీసుకొస్తున్న ఆలయ చైర్మన్, ఈవో

సీనియర్ ఎద్దుల పందేల విజేతలు వీరే..

మేళ్లచెర్వు ఎద్దుల పందేల్లో ఆఖరి ఘట్టమైన సీనియర్ విభాగానికి ఆదివారం రాత్రి పోటీలు ముగిశాయి. ఈ పోటీల్లో సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన సుంకి సురేందర్‌రెడ్డి, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం నంద్యాల జిల్లా పెద్ద కొట్టాల గ్రామానికి చెందిన బొరెడ్డి కేశవరెడ్డికి చెందిన జతలు నిర్ణీత 25 నిమిషాల సమయంలో 3,046 అడుగుల దూరాన్ని లాగి ప్రథమ బహుమతికి ట్రాక్టర్‌ను గెలుచుకున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తాడేపల్లికి చెందిన లక్కిరెడ్డి నిఖితారెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన అఖిలేశ్వర్‌రెడ్డికి చెందిన గిత్తలు నిర్ణీత 25 నిమిషాల సమయంలో 2557.10 అడుగుల దూరాన్ని లాగి ద్వితీ య బహుమతి రూ.1.50 లక్షల నగదును గెలుచుకున్నాయి.

మగ శిశువు విక్రయ కలకలం

- 15 నెలల తర్వాత గుర్తించిన చైల్డ్ వెల్ఫేర్ అధికారులు • పోలీసుల అదుపులో శిశువు తల్లితండ్రులు

సూర్యాపేటరూరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట మండలం రామచంద్రపురం గ్రామంలో మగశిశువు (18 నెలలు) విక్రయ కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట మండలం రామచంద్రపురం గ్రామానికి చెందిన ఇంద్రకంటి సతీష్, స్వప్న దంపతులకు ముగ్గురు మగ సంతానమే. దీంతో ముగ్గురినీ సాకలేక బాబుకు మూడు నెలల వయసులో 15నెలల క్రితం హైదరాబాద్‌కు చెందిన నాగరాజు అనే వ్యక్తి ద్వారా హైదరాబాద్‌కు చెందిన సంతానంలేని దంపతులకు రూ.5లక్షలకు విక్రయించినట్లు సమాచారం. ఈ విషయాన్ని సూర్యాపేట జిల్లా చైల్డ్ వెల్ఫేర్ అధికారులు గుర్తించి ఆధారాలు సేకరించి శనివారం హైదరాబాద్‌లో మగ శిశువును స్వాధీనం చేసుకున్నారు. ఈ ఉదంతంపై సూర్యాపేట రూరల్ పోలీస్‌స్టేషన్‌లో శిశువు తల్లితండ్రులపై ఫిర్యాదు చేయడంతో సంఘటన వెలుగులోకి వచ్చింది. దీంతో రూరల్ పోలీసులు ఇరువురి తల్లితండ్రులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. శిశువును కొనుగోలుకు సహకరించిన వ్యక్తులు నాగరాజు, మరో ఇద్దరు కోసం రూరల్ పోలీసులు హైదరాబాద్‌లో గాలిస్తున్నారు. ప్రస్తుతం శిశువు నల్లగొండ బాల సంరక్షణ కేంద్రంలో ఉంచారు. చైల్డ్ వెల్ఫేర్ అధికారుల ఫిర్యాదు మేరకు శిశువు విక్రయ కేసులో మొత్తం ఏడుగురిపై కేసు నమోదయ్యే అవకాశం ఉంది.

కుక్కల దాడిలో 10 గొర్రెలు మృతి

తుంగతుర్తి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): కుక్కల దాడిలో సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండంలోని మంచ్యతండాలో 10 గొర్రెలు మృతి చెందాయి. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచ్యతండాకి చెందిన లకావత్ లాల్ ‌సింగ్‌కు చెందిన గొర్రెలను శనివారం రాత్రి ఇంటి వద్ద కర్రలతో ఏర్పాటు చేసిన దొడ్డిలో ఉంచారు. అర్ధరాత్రి సమయంలో కుక్కలు దాడి చేసి 10 గొర్రెలను చంపేశాయి. సుమారు రూ.1 లక్ష నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.



కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రెలు

ఇంటి పన్ను వసూలు వేగవంతం చేయాలి

కట్టంగూరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఇంటి పన్ను చెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించాలని ఇన్‌చార్జి ఎంపీవో చింతమల్ల చలపతి అన్నారు. కట్టంగూరులో ఆదివారం గ్రామపంచాయతీ సిబ్బంది ఇంటిపన్ను వసూలు చేస్తున్న కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది జానకిరాములు, కాపుగంటి శ్రీనివాస్, బాలచందర్ తదితరులు పాల్గొన్నారు.

అగ్రవర్ణాల ఆధిపత్యం కోసమే మల్లన్న సస్పెన్షన్

శాలిగౌరారం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): అగ్రవర్ణాల ఆధిపత్యం కోసమే తీన్మార్ మల్లన్నను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు బీసీ సంఘం మండల నాయకుడు భూపతి శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ వాదమే కాంగ్రెస్ పార్టీ నుంచి తీన్మార్ మల్లన్న సస్పెండ్‌కు కారణమని అన్నారు. బీసీ ప్రజల్లో చైతన్యం తీసుకవస్తూ రాజకీయంగా, ఆర్థికంగా బీసీల వాటా బీసీలకు దక్కాలని డిమాండ్ చేయడం వల్లే ఆయన్ను సస్పెండ్ చేశారని అన్నారు.

పెళ్లి దుస్తుల బ్యాగు అప్పగించిన కండక్టర్

దేవరకొండ, మార్చి 2(ఆంధ్రజ్యోతి): దేవరకొండ నుంచి శనివారం హైదరా బాద్‌కు బయలుదేరిన ఆర్టీసీ బస్సులో ఓ మహిళ ప్రయాణికురాలు పెండ్లి దుస్తుల బ్యాగును మర్చిపోయి వెళ్లింది. దీంతో కండక్టర్ జహిరొద్దిన్ ఆ బ్యాగును గమనించి దేవరకొండ డిపోలో అధికారులకు అప్పగించారు. దీంతో సదరు ప్రయాణికురాలు ఫోన్ ద్వారా విషయాన్ని డీఎం దృష్టికి తీసుకువచ్చింది. ఆయన విచారణ చేసి ఆదివారం ప్రయాణికురాలికి బ్యాగును హైదరాబాద్ బస్సులో కంట్రోలర్ ద్వారా అప్పగించారు. బ్యాగును డిపోలో అప్పగించిన కండక్టర్ జహి రొద్దిన్‌ను ఆర్టీసీ డీఎం తల్లాడ రమేష్‌బాబు, అసిస్టెంట్ మేనేజర్ సైదులుగౌడ్ అభినందించారు.

రేపు రథోత్సవం

చింతపల్లి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని నెల్వలపల్లి గ్రామంలోని మల్లి కార్జునస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రథోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లుఆలయ కమిటీ పూజారి గొట్టి ముక్కల నరసింహశర్మ ఆదివారం తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు అన్ని వసతి సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమా న్ని విజయవంతం చేయాలని కోరారు.

గుంతల రోడ్డు బాగుపడేది ఎప్పుడో!





కమ్మగూడెం, దామెర గ్రామాల మధ్యలో రోడ్డు, (ఇన్‌సెట్‌లో) రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన శిలాఫలకం

- శంకుస్థాపన చేసి 16 నెలలు గడిచినా నేటికీ ప్రారంభం కాని రోడ్డు పనులు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- రోడ్డు పనులు చేపట్టాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్న ప్రజలు

నాంపల్లి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిట్టెంపాడు నుంచి నెవిళ్లగూడెం దామెర రోడ్డు అధ్వానంగా తయారైంది. గుంతలమయంగా ఉన్న చిట్టెంపాడు నుంచి నెవిళ్లగూడెం దామెర రోడ్డు మీద ప్రయాణం చేయాలంటే వాహనదారులు తీవ్రంగా ఇబ్బందులకు గురవుతున్నారు. పెద్దపెద్ద గుంతలు ఉండటం, కంకర తేలి ఉండటంతో వాహనాలు చెడిపోతున్నాయని పలువురు పేర్కొంటున్నారు. ఈ రహదారిపై ఒకటి, రెండు సార్లు వెళితే నడుమనొప్పులు వస్తున్నాయని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. మునుగోడు ఉప ఎన్నికలో గెలిచిన అప్పటి బీఆర్ఎస్ అభ్యర్థి కూసుకంట్ల ప్రభాకర్‌రెడ్డి చిట్టెంపాడు నుంచి నెవిళ్లగూడెం, దామెర కమ్మగూడెం రైస్‌మిల్లు వరకు 7 కిలోమీటర్ల వరకు ఉన్న ఈ రోడ్డుకు రూ.2.20 కోట్లు మంజూరు చేశారు. 9.10.2023లో అప్పుడు ఎంపీపీగా ఉన్న ఏడుదొడ్ల శ్వేతరవీందర్ రెడ్డి ఈ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన చేసి 16 నెలలు గడుస్తున్నా రోడ్డు పనులు చేపట్టకపోవడంతో వాహనదారులతో పాటు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతీరోజు దామెర, నెవిళ్లగూడెం గ్రామాల ప్రజలు మండలంలోని ఆఫీసులు, నిత్యావసర సరుకులు, సరుకుల కోసం, విద్యార్థులు స్కూల్, కళాశాలలకు వెళ్లాలంటే ఈ రోడ్డు మీదుగా వెళ్లాల్సిన పరిస్థితి. మర్రిగూడెం మడలంలోని దామెరబీమనపల్లి, కమ్మగూడెం, లెంకలపల్లి, సరంపేటకు చెందిన ప్రజలు దేవరకొండ, మల్లేపల్లి, నాంపల్లిలోని ఎస్‌టీవో కార్యాలయానికి వెళ్లాలన్నా ఈ రహదారి నుంచే వెళ్లాల్సి ఉంది. రోడ్డంతా గుంతలమయంగా ఉండటంతో అత్యవసర సమయాల్లో 108వాహనం రావడానికి కూడా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ప్రస్తుతం ఉన్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చొరవ తీసుకొని రోడ్డు పనులు చేపట్టాలని నెవిళ్లగూడెం, దామెర గ్రామ ప్రజలు కోరుతున్నారు.

గుంతల రోడ్డుతో అవస్థలు



అడుగడుగునా గుంతలు ఉన్న రోడ్డు వెంట ప్రయాణించాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డు సరిగ్గా లేకపోవడం వల్ల ఊరికి బస్సే రావడం లేదు. ప్రభుత్వం మారడంతో రోడ్డు వేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. మా బాధలు ఎవరికీ పట్టడం లేదు. ఇప్పటికైనా అధికారులు ప్రభుత్వం స్పందించి రోడ్డు వేయాలి.

- తల్లోజు ప్రవీణ్‌చారి,దామెర,నాంపల్లి

అప్రూవల్ రాగానే పనులు చేపడుతాం

గతంలో రోడ్డు మంజూరైనప్పుడు 3.5 వెడల్పుకు నిధులు మంజూరు చేసింది. ప్రభుత్వం రోడ్డు 5.5 వెడల్పు పెంచడానికి ప్రభుత్వానికి ప్రపోజల్ పంపాం. అనుమతులు రాగానే పనులు చేపడుతాం.

- ఉదయ్‌రెడ్డి, పీఆర్ఏఈ, నాంపల్లి



ఎంపికైన వారితో అనిల్‌కుమార్

విద్య, ఉపాధితోనే సామాజిక అభివృద్ధి

హాలియా, మార్చి 2(ఆంధ్రజ్యోతి): విద్య, ఉపాధి కల్పన ద్వారానే సామాజిక అభివృద్ధి సాధ్యమని ఏకే ఫౌండేషన్ చైర్మన్ కట్టెబోయిన అనిల్‌కుమార్ అన్నారు. స్థానిక శ్లోక పాఠశాలలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాబ్ మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత అభివృద్ధికి ఏకే ఫౌండేషన్ ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. జాబ్ మేళాకు సాగర్ నియోజకవర్గం, మిర్యాలగూడ, దేవరకొండ, నల్లగొండ ప్రాంత యవకులు పాల్గొనగా వారికి క్వస్ క్రాఫ్, ఫోక్సకాన్ కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. అనంతరం ఎంపికైన 50 మంది అభ్యర్థులకు ఫౌండేషన్ చైర్మన్ అనిల్‌కుమార్ నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు సునీల్‌రావు, రాధిక, రాజిరెడ్డి, ఉపాధ్యాయులు రాజేష్, రమేష్, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా రామలింగేశ్వరస్వామి రథోత్సవం



కొంపల్లి గ్రామంలో రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

మునుగోడురూరల్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొంపల్లి గ్రామాల్లో రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం తెల్లవారుజామున అగ్నిగుండాలు ఉదయం గ్రామంలో స్వామివారి రథోత్సవం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్వామివారి రథోత్సవానికి గ్రామంలోని ప్రజలు కానుకలతో భక్తిశ్రద్ధలతో మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వెదిర విజయేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ జాల వెంకన్నయాదవ్, గ్రామస్థులు మక్కెన అప్పారావు, వీరమల్ల పురుషోత్తం, మోగుదాల శంభుగౌడ్, బూరుగు శ్రీనివాస్, శివయ్య, జడీమడ్ల దశరథ, గ్రామస్థులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో కాంస్యపతకం



కాంస్య పతకం సాధించిన ధావన్‌ను సన్మానిస్తున్న ప్రవీణ్‌కుమార్

చిట్యాల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో జరిగిన జరిగిన ఓపెన్ రాష్ట్ర స్థాయి ఇంటర్ స్కూల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో చిట్యాలకు చెందిన ఓర్సు ధావన్ అండర్ 50 వెయిట్ విభాగంలో కాంస్య పతకం సాధించినట్లు కోచ్ ఫణీంద్రకుమార్ తెలిపారు. రాష్ట్రస్థాయిలో పతకం సాధించిన ధావన్‌ను తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, సీనియర్ తైక్వాండో మాస్టర్ సుధాకర్ అభినందించారు.

పాత పింఛన్ విధానాన్ని కొనసాగించాలి



యుద్ధభేరి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉద్యోగులు

రామగిరి, నల్లగొండ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు పాత పింఛన్ విధానాన్ని కొనసాగించాలని తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఉదావత్ లచ్చిరాం డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని ఇందిరాపార్కులో జరిగిన యూపీఎస్ యుద్ధభేరి ధర్నాకు జిల్లా నుంచి ఆదివారం అధిక సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనిఫైడ్ పింఛన్ విధానం కాకుండా పాత పింఛన్ విధానాలనే కొనసాగించాలని కోరారు. యుద్ధభేరికి తరలివెళ్లిన వారిలో జిల్లా అధ్యక్షుడు ఏకుల యాకూబ్, పున్న సోమనాథ్, అక్కినపల్లి భద్రయ్య తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రజలందరికీ సామాజిక న్యాయం జరగాలి



నకిరేకల్ జడ్పీ హైస్కూల్‌లో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బహుజన కార్మిక సంఘాలు

నకిరేకల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రజలందరికీ సామాజిక న్యాయం జరిగి విప్లవం విజయవంతం కావాలంటే కులవర్గ పోరాటాలు జమిలిగా, కులవర్గ నిర్మూలన జరిగినప్పుడే ఇండియా పరిస్థితులు అనుకూలంగా ఉంటాయని బహుజన కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి గాజుల శ్రీనివాస్ అన్నారు. జడ్పీ హైస్కూల్ ఆడిటోరియంలో ఆదివారం బహుజన మహాసంఘం ఆధ్వర్యంలో ఇండియాలో ఇప్పుడు ఏం చేయాలి అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలోనే మారోజు వీరన్న ఇండియాలో ఏం చేయాలని అనే పుస్తకాన్ని రచించారని అదే తరహాలో బహుజన మహాసభ పుస్తకాన్ని రచించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో బహుజన మహాసభ ప్రతినిధి చెట్టిపల్లి కాన్షీరాం, నాయకులు మల్లియాద్రి, మాంద్ర మల్లయ్య, వలిగొండ లింగయ్య, నారబోయిన వెంకట్, వీరస్వామి, చిరంజీవి, సాదుల నర్సయ్య, అంబేడ్కర్, రవి, వెంకటాద్రి పాల్గొన్నారు.

ఘనంగా శ్రీపాదరావు జయంతి వేడుకలు



శ్రీపాదరావుకు నివాళులర్పిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, అధికారులు

నల్లగొండటౌన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ స్పీకర్ దివంగత దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కలెక్టర్ ఇలా త్రిపాఠి హాజరై శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్వో, ఆర్డీవో వై.అశోక్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారి మోతీలాల్, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

● కట్టంగూరు: మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆదివారం దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీవో చింతమల్ల చలపతి మాట్లాడుతూ 1991-95 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో శాసనసభ స్పీకర్‌గా ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఆర్ఐ కుమార్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు అనిల్, కంప్యూటర్ ఆపరేటర్లు గోవిందరాజు, లక్ష్మణ్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు విడుదల చేయాలి

● *పొలాలను కాపాడాలని రైతుల ధర్నా*

నకిరేకల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): సాగునీటి అందించి పంట పొలాలను కాపాడాలని పలువురు రైతులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ఎల్-11 తూము వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పానగల్ ఎస్ఎల్‌బీసీ డీ-40 కాల్వ ద్వారా ఎల్- 11 తూము నుంచి నకిరేకల్ మండలం గోరెంకలపల్లి, మోదినిగూడెం, తిప్పర్తి మండలంలోని మామిడాల, ఇండ్లూరు, దూపలగూడెం, సర్వారం, గుర్రప్పగూడెం, మోత్కూరు, బుసిరెడ్డిగూడెం గ్రామాలకు చెందిన రైతులు ఎల్-11 తూము వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వానాకాలం నుంచి డీ-40 కాల్వ ద్వారా సాగునీరు వదలడం లేదని, నీటిని వదిలి తమ పంట పొలాలను కాపాడాలని రైతులు డిమాండ్ చేశారు. ఇటీవల నీటిని వదలాలని నకిరేకల్, తిప్పర్తి రహదారిపై రాస్తారోకో నిర్వహిస్తే తిప్పర్తి పోలీసులు నిర్బంధించారని రైతులు ఆరోపించారు. పదేళ్లలో తూములకు గేటు ఏర్పాటు చేయలేదని, ఎల్ -11 తూము వద్ద ఎందుకు గేటు ఏర్పాటు చేశారని వారు ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి తూముకు వేసిన గేటును తొలగించి నీటిని విడుదల చేయాలని రైతులు డిమాండ్ చేశారు.



నకిరేకల్ మండలం గోరెంకలపల్లి ఎస్ఎల్‌బీసీ డీ-40 కాల్వ వద్ద ధర్నా చేస్తున్న రైతులు

గిరిజనులు ఐక్యంగా ఉండాలి

● *గిరిజన సంక్షేమ సంఘం*

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొర్ర శంకర్‌నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న గిరిజన సంఘం నాయకులు

హాలియా, మార్చి 2(ఆంధ్రజ్యోతి): గిరిజనుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ఉండాలని గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొర్ర శంకర్ నాయక్ అన్నారు. స్థానిక అతిథి గృహంలో టీఆర్‌జీఎస్ సాగర్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి రమావత్ నరేష్‌నాయక్ అధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్‌నాయక్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గిరిజనులకు రావాల్సిన సంక్షేమ పథకాలను, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఆత్మీయ భరోసాలు అర్హులైన వారికి అందే విధంగా సంఘం నాయకులు కృషి చేయాలన్నారు.అనంతరం సంఘం నియోజకవర్గ కోశాధికారిగా సపావట్ పృథ్వీ రాజ్ చౌహన్, ఉపాధ్యక్షుడిగా సఫావట్ శివకుమార్, మహిళా అధ్యక్షురాలుగా సపావత్ గులాబీ, దేవరకొండ అధ్యక్షుడిగా ముడావత్ నరేష్‌నాయక్, ఉపాధ్యక్షుడిగా నేనావత్ హాతీరాం, గౌరవ సలహాదారుగా జటావత్ రాములు, అనుముల మండల అధ్యక్షుడిగా మోగావత్ దేవేందర్, పట్టణ అధ్యక్షుడిగా మూడావత్ అంజి, తిరుమలగిరి మండలాధ్యక్షుడిగా రమావత్ నరేష్, నియో జకవర్గ కమిటీ సభ్యులుగా జటావత్ బద్రునాయక్, పట్టణ ఉపాధ్యక్షులుగా లా వూడి రాజేంద్రప్రసాద్, ఆడావత్ అశోక్‌నాయక్, జటావత్ నిమ్మనాయక్, పీఏపల్లి మండలాధ్యక్షుడు రమావత్ అంజి, నేనావత్ మునినాయక్‌కు నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమావత్ జవహర్‌నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు నేనావత్ అశోక్‌నాయక్, కొర్ర రాజు, నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు రమావత్ లాలునాయక్, రమేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నియమ నిష్టతతో ఉపవాస దీక్షలు కొనసాగించాలి

డిండి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): రంజాన్ మాస ఉపవాసదీక్షలు ముస్లింలు నియమ నిష్టతతో కొనసాగించాలని దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. స్థానిక ఎర్రారం గ్రామంలో ముస్లిం పేద కుటుంబాలకు రంజాన్ ప్రారంభం సందర్భంగా తోఫా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవిత్రమైన రంజాన్‌మాసంలో ముస్లింలు నియమ నిష్టలతో కూడిన ఉపవాస దీక్షను కొనసాగించాలని అన్నారు. అనంతరం డిండి మండల కేంద్రంలోని గంగమ్మ ఆలయంలో బోనాల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొంతినేని వెంకటేశ్వరరావు, సిరాజ్‌ఖాన్, అబ్దుల్ ఖబీర్, యూనిస్, ఎండీ.అక్రం, షఫీ, గుర్రం రాములు, పోలం లక్ష్మణ్, మేకల కాశయ్య, గడ్డమీది సాయి, పోల వెంకటేష్, వావిల్ల సలయ్య, కలీం, పోలం శ్రీను, సుధాకర్, తీజ్, కిన్నెర హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ: నెలరోజులు కఠోర నియమాలు పాటిస్తే ముస్లింలు అల్లా అనుగ్రహన్ని పొందవచ్చునని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. రంజాన్ సందర్భంగా మిర్యాలగూడ సీతారాంపురం చిన్న మజీద్‌లో ఉపవాసదీక్షల ప్రారంభోత్సవంలో ఆదివారం ఆయన పాల్గొని ప్రత్యేక నమాజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసంలో ముస్లింలు కఠినమైన ఉపవాసదీక్షలతో అల్లాను స్మరించుకుంటారని అన్నారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయానికి భక్తుల రద్దీ



ఎల్లమ్మ ఆలయంలో మొక్కుబడి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

కనగల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల రేణుకా ఎల్లమ్మ ఆలయానికి ఆదివారం భక్తుల రద్దీ కొనసాగింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఆలయ ప్రదిక్షణలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. పలువురు భక్తులు ఆలయంలో మొక్కుబడి కల్యాణాలు జరిపించారు. అమ్మవారికి చీరసారె వడి బియ్యం సమర్పించుకున్నారు. పుట్టలో పాలు పోసి నాగపడిగలకు మొక్కుకున్నారు. కోరికలు నెరవేరాలని వేపకొమ్మలకు ముడుపులు కట్టారు. రిటైర్డ్ కలెక్టర్ పబ్బతి యాదిరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ సిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు.

ఆలయ బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

కనగల్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేగట్టె గ్రామ భవాని శంకరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ఉత్సవకమిటీ సభ్యులు ఆదివారం ఆలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు. 8వ తేదీన స్వామివారి కల్యాణం, 10న రథోత్సవం, 11న అగ్నిగుండాలు ఉంటాయని ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ గంజి చంద్రమౌళి, కార్యదర్శి దొమ్మాటి అంజయ్య, కోశాధికారి కర్నాటి శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కడారి కృష్ణయ్య, మాజీ ఎంపీటీసీ పాలకూరి పుష్పలత వెంకటేశం, ఎర్రోల ఎల్లయ్య, వెంకటేశం, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ డైరెక్టర్‌కు సుఖేందర్‌రెడ్డి పరామర్శ



మోహన్‌రెడ్డిని పరామర్శిస్తున్న శాసనమండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి, అమిత్‌రెడ్డి

చిట్యాలరూరల్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): చిట్యాల పీఏసీఎస్ మాజీ చైర్మన్, ప్రస్తుత డైరెక్టర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నర్రా వినోద భర్త నర్రా మోహన్‌రెడ్డి అనారోగ్య సమస్యలతో హైదరాబాద్‌లో ఎల్‌బీ నగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆయన్ను శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. తనయుడు, డెయిరీ డెవలప్‌మెంట్ రాష్ట్ర చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డితో కలిసి హైదరాబాద్‌లోని ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. అనారోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట గ్రామ మాజీ సర్పంచ్ బుర్రి రవీందర్‌రెడ్డి ఉన్నారు.

సంక్షేమ బోర్డులో కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలి



కార్మికుల మహాసభలో మాట్లాడుతున్న దేవేందర్‌రెడ్డి

డిండి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): సంక్షేమ బోర్డులో కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలని ఏఐటీయూసీ భవన నిర్మాణ కార్మిక సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లా దేవేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కందుకూరు గ్రామంలో ఆదివారం నిర్వహించిన భవన నిర్మాణ కార్మిక సంఘం 8వ మండల మహాసభలో ఆయన మాట్లాడారు. కొన్ని నెలలుగా కార్మికులకు నగదు చెల్లింపులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో కార్మికశాఖ వైఫల్యం చెందిందని ఆరోపించారు. సాంకేతిక సమస్యలు చూపి ఆరు నెలలుగా కార్మికులను కార్యాలయం చుట్టు తిప్పుకుంటు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. ఎన్నో పోరాటాల ఫలితంగా సాధించుకున్న సంక్షేమ బోర్డు సమస్యల నిలయంగా మారిందన్నారు. సమావేశంలో వెంకటరమణ, నూనె రామస్వామి, ఎండీ.మైనొద్దిన్, నూనె వెంకటేశ్వర్లు, లింగమయ్య, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.110	170	190
సూర్యాపేట	రూ.125	170	200
నల్లగొండ	రూ.125	170	194

ఉష్ణోగ్రత గరిష్ఠం 34.5 । కనిష్ఠం 18.4



తినాలా? వద్దా?

- చికెన్ ప్రియుల డైలమా
- తగ్గిన చికెన్ కొనుగోళ్లు
- పెరిగిన మటన్, చేపల విక్రయాలు
- కోళ్లకు తగ్గుముఖంపట్టిన వైరస్ లక్షణాలు

ఉమ్మడి జిల్లాలో బర్డ్‌ఫ్లూ లక్షణాలు తగ్గినా చికెన్ తినాలా? వద్దా? అనే డైలమాలో చికెన్ ప్రియులు ఉన్నారు. ఈ నేపథ్యంలో చికెన్ విక్రయాలు తగ్గగా మాంసం ప్రియులు ప్రత్యామ్నాయంగా చేపలు, మటన్ కొనుగోలు చేస్తున్నారు. ఫలితంగా ఉమ్మడి జిల్లాలో చేపలు, మటన్ విక్రయాలు పెరిగాయి. అయితే వీటికి డిమాండ్ పె రగడంతో వ్యాపారులు అమాంతం ధరలు పెంచి విక్రయిస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

రాష్ట్రంతోపాటు సరిహద్దు ఏపీ రాష్ట్రంలోని పలు జిల్లాలో కోళ్లు అకస్మాత్తుగా మృత్యువాత పడటంతో ఉమ్మడి జిల్లాలో సైతం బర్డ్‌ఫ్లూ కలకలం రేగింది. ఖమ్మం, నిజామాబాద్ జిల్లాలో కోళ్లు మృతిచెందడంతో ఆ ప్రభావం ఉమ్మడి నల్లగొండ జిల్లాపై కూడా కనిపించింది. ఉమ్మడి జిల్లాలో వేల సంఖ్యలో కోళ్లు మృతిచెందినా, అవి ఏ కారణాలతో అనేది తొలుత అంతుచిక్కలేదు. ఆ తరువాత చౌటుప్పల్ మండలంలో రాష్ట్రంలోని తొలి బర్డ్‌ఫ్లూ కేసు నమోదైంది. పౌల్ట్రీ రైతులు అప్రమత్తంగా ఉండకపోవడం, కోళ్లు మృతిచెందినా, ఆ విషయాన్ని పశుసంవర్ధకశాఖ అధికారులు, వైద్యుల దృష్టికి తీసుకెళ్లకపోవడంతో ఈ పరిస్థితులు తలెత్తాయి. సంబంధిత కోళ్ల ఫారమ్ యజమానులు, పౌల్ట్రీ రైతులు కోళ్ల ఆరోగ్యాన్ని అంచనా వేయలేకపోయారని, విషయాన్ని తమ దృష్టికి ఆలస్యంగా తీసుకువచ్చారని అధికారులు పేర్కొంటున్నారు.దీనికి తోడు గత నెలా మూడో వారం వరకు కూడా అం టే శివరాత్రి వరకు కనిష్ఠ ఉష్ణోగ్రతలు తక్కువగా ఉండి చల్లటి గాలులు వీయడం కూడా కోళ్ల మరణానికి కారణమని తెలుస్తోంది. ప్రస్తుతం గరిష్ఠ ఉష్ణోగ్రతలు పెరగడంతో కొంత మేర వైరస్ లక్షణాలు తగ్గుముఖం పట్టినట్టు సమాచారం. మార్చిలో ఎండలు 35నుంచి 40డిగ్రీలవరకు ఏప్రిల్,మేలో 45డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలు ఉన్నాయి. ఉష్ణోగ్రతలు పెరగడంతో బర్డ్‌ఫ్లూ వైరస్ లక్షణాలు కనుమరుగయ్యే అవకాశాలు ఉన్నాయి.

చికెన్ ప్రియుల సందేహాలు

బర్డ్‌ఫ్లూ కలకలంతో చికెన్ ప్రియులు డైలమాలో ఉన్నారు. చికెన్ తింటే జబ్బులు వస్తాయనే విషయం వారిని వెంటాడుతోంది. అయితే చికెన్ బాగా ఉడికించి తింటే ఎలాంటి ప్రమాదం లేదని పశు వైద్యులు పేర్కొంటున్నారు. ప్రస్తుతానికి చికెన్ కొనుగోళ్లపై ప్రభావం పడటంతో కోళ్ల...

మిగతా 6వ పేజీలో..



హోరాహోరీగా సాగిన శాసనమండలి నల్లగొండ-ఖమ్మం-వరంగల్ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికలో విజేత ఎవరో సోమవారం తేలనుంది. ఈ నియోజకవర్గానికి ఫిబ్రవరి 27న ఎన్నిక జరగ్గా, సోమవారం ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఆర్జాలబావి ప్రాంతంలోని స్టేట్‌వేర్‌హౌసింగ్ గోదాములో ఈ ఓట్ల లెక్కింపు చేపట్టనుండగా, ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి పర్యవేక్షణలో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు.

- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి,నల్లగొండ)



ఎమ్మెల్సీ విజేత

తేలేది నేడే

- కౌంటింగ్‌కు పూర్తయిన ఏర్పాట్లు
- ఉదయం 8 నుంచి మొదలవనున్న ప్రక్రియ
- 25 రౌండ్లలో తొలి ప్రాధాన్య ఓట్ల లెక్కింపు
- కోటా ఓటు రాకపోతే ఎలిమినేషన్ పద్ధతిలో ద్వితీయ ప్రాధాన్య ఓట్ల లెక్కింపు



నల్లగొండ-ఖమ్మం-వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలో ప్రధాన ఉపాధ్యాయ సంఘాల అభ్యర్థులు సహా మొత్తం 19 మంది పోటీచేశారు. ఈ ఎన్నికలో మొత్తం 25,797 ఓట్లకు, 93.57 శాతం అంటే 24,139 ఓట్లు పోలయ్యాయి. ప్రాధాన్య క్రమంలో ఓట్ల కేటాయింపు ఉండే ఈ ఎన్నికలో విజేత కావాలంటే 50శాతానికి అదనంగా ఒక్క ఓటు (కోటా ఓటు) రావాలి. అప్పటివరకు ప్రాధాన్య క్రమంలో ఓట్లను లెక్కిస్తారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా కౌంటింగ్ కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటలను జరగకుండా పోలీస్‌యంత్రాంగం భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది.

ఉదయం 8గంటల నుంచి

ఎమ్మెల్సీ ఎన్నికల కౌటింగ్ ప్రక్రియను సోమవారం ఉదయం 8గంటలకే ప్రారంభించనున్నట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇలా త్రిపాఠి తెలిపారు. ఈ మేరకు కౌంటింగ్ సిబ్బందికి ఇప్పటికే శిక్షణ, కౌంటింగ్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అభ్యర్థులు సైతం ఇప్పటికే కౌంటింగ్ ఏజంట్లను నియమించుకున్నారు. మొదట స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరచిన బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ హాల్‌కు తరలించి ఏజెంట్ల సమక్షంలో బాక్సులను తెరచి బ్యాలెట్ పేపర్లను ఫాం-16 ప్రకారం సరిపోల్చుతూ అన్నింటినీ డ్రమ్ముల్లో వేసి కలిపేస్తారు. మొత్తం 8 రౌండ్లలో ఈ బండిల్స్ కట్టే కార్యక్రమం నిర్వహించి, వాటన్నింటినీ ఆర్వో, అభ్యర్థుల సమక్షంలో ఫాం-16తో సరిపోల్చి టేబుళ్లకు పంపిణీ చేస్తారు. ఉదయం 11గంటలవరకు ఈ ప్రక్రియ ముగుస్తుందని భావిస్తున్నారు. వచ్చిన బండిల్స్‌ను 25 టేబుళ్లకు సమానంగా పంపిణీ చేసి కౌంటింగ్ ప్రారంభిస్తారు. మొత్తం 900-950 వరకు బండిళ్లు కానుండడంతో ఒక్కో టేబుల్‌కు 40 చొప్పున కేటాయిస్తూ చివరి టేబుల్‌కు మిగిలిన వాటిని కేటాయిస్తారు. ఆర్వో టేబుల్‌తో పాటు, కౌంటింగ్‌కు 25 టేబుల్స్ ఏర్పాటు చేశారు. ఆర్వో టేబుల్ వద్ద రిటర్నింగ్ అధికారి, సహాయ రిటర్నింగ్ అధికారితో పాటు, అభ్యర్థులు, లేక వారి ప్రధాన ఏజెంట్లు కూర్చుంటారు. కౌంటింగ్ టేబుళ్ల వద్ద ఒక కౌంటింగ్ అధికారి, ఇద్దరు సహాయ కౌంటింగ్ అధికారులు, ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారు. వీరి చుట్టూ 19 మంది అభ్యర్థుల తరుపున ఒక్కో కౌంటింగ్ ఏజెంట్ ఉంటారు. ఒక్కో టేబుల్ వద్ద తొలి ప్రాధాన్య ఓట్ల కౌంటింగ్ పూర్తయ్యాక రిటర్నింగ్ అధికారి ఆమోదించిన తర్వాత ఫలితం ప్రకటిస్తూ వస్తారు. చెల్లని ఓట్లను తొలగిస్తూ చెల్లిన ఓట్లలో తొలిప్రాధాన్య ఓట్లను లెక్కిస్తూ కౌంటింగ్ కొనసాగిస్తారు. మొదటి ప్రాధాన్య ఓట్లు 25 రౌండ్లు పూర్తయ్యేలోపు కోటా ఓటు వస్తే అక్కడితో కౌంటింగ్ నిలిపి విజేతను ప్రకటిస్తారు. మొదటి ప్రాధాన్య ఓట్ల లెక్కింపులో అభ్యర్థులెవరికీ కోటా ఓటు రాకపోతే, ద్వితీయ ప్రాధాన్య ఓట్ల లెక్కింపు చేపడతారు. మొత్తం 19 మంది అభ్యర్థుల్లో అతి తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థుల నుంచి (దిగువ నుంచి) ఒక్కొక్కరిని ఎలిమినేట్ చేస్తూ ద్వితీయ ప్రాధాన్య ఓట్ల లెక్కింపు కొనసాగిస్తారు. కోటా ఓటు వచ్చేంతవరకు ద్వితీయ ప్రాధాన్య ఓట్ల లెక్కింపు కొనసాగుతుంది. ద్వితీయ ప్రాధాన్య ఓట్లలోనూ ఎవరికీ కోటా ఓటు రాకపోతే, తృతీయ ప్రాధాన్య ఓట్లను కూడా లెక్కిస్తారు. దాదాపుగా ద్వితీయ ప్రాధాన్య ఓట్లతోనే ఫలితం తేలుతుందని అంతా అంచనా వేస్తున్నారు.

కౌంటింగ్ కేంద్రం వద్ద భారీ బందోబస్తు

ఎమ్మెల్సీ ఎన్నిక కౌంటింగ్ నేపథ్యంలో ఆర్జాలబావి వద్ద ఏర్పాటు చేసిన కేంద్రం వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. కౌంటింగ్‌కు 250 మంది సిబ్బందిని నియమించారు. మరోవైపు...

మొదటి ప్రాధాన్య ఓట్ల ఫలితం సాయంత్రానికి

కౌంటింగ్ ప్రక్రియ ఉదయం 8గంటలకే మొదలవుతుంది. బ్యాలెట్లను బండిల్స్‌గా మార్చి టేబుళ్లకు కేటాయించే ప్రక్రియ 11 గంటల వరకు ముగుస్తుంది. ఆ తరువాత వరుసగా ఒక్కో టేబుల్ వారీగా ఓట్ల లెక్కింపు మొదలవుతుంది. మొదటి ప్రాధాన్య ఓట్ల లెక్కింపు 11 గంటలకు ప్రారంభిస్తే, సాయంత్రం 3గంటలలోగా పూర్తవుతుంది. అప్పటికీ కోటా ఓటు రాకపోతే, మధ్యాహ్న భోజనవిరామం తర్వాత ద్వితీయ ప్రాధాన్య ఓట్ల లెక్కింపు ప్రారంభిస్తారు. ద్వితీయ ప్రాధాన్య ఓట్ల లెక్కింపు చేయాల్సి వస్తే ఈ ప్రక్రియ అర్ధరాత్రి వరకూ కొనసాగే అవకాశం ఉంది. కోటా ఓటు వచ్చిన వెంటనే కౌంటింగ్‌ను నిలిపి విజేతను ప్రకటిస్తారు. స్వతంత్ర అభ్యర్థులు ఎక్కువగా ఉండడంతో ద్వితీయ ప్రాధాన్య ఓట్ల లెక్కింపు మొదలయితే ప్రక్రియ నిదానంగా కొనసాగుతుందని, దీంతో మంగళవారం తెల్లవారుజామువరకు కౌంటింగ్ కొనసాగే అవకాశముందని అంచనావేస్తున్నారు.

మిగతా 6వ పేజీలో..

సాగర్‌ను తోడేస్తున్నారు

- కుడి, ఎడమ కాలువలకు ఎడా పెడా తరలింపు
- వేసవిలో తాగునీటి కష్టాలు తప్పవంటున్న నిపుణులు
- మూసీలో ఇన్‌ఫ్లో నిల్... అవుట్‌ఫ్లో ఫుల్

నాగార్జునసాగర్ ప్రాజెక్టులో కనీస నీటిమట్టం నిర్వహణ సాధ్యమేనా? అంటే సాగర్ నుంచి ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు కుడి, ఎడమ కాలువలకు తోడివేతను చూస్తే అసాధ్యమే అంటున్నారు నీటి రంగ నిపుణులు. ఈ నీటి సంవత్సరంలో (ఈ ఏడాది జూన్ నుంచి వచ్చే ఏడాది మే వరకు) సాగర్ ప్రాజెక్టు కనీస నీటిమట్టం వరకు తోడుకోవాల్సి ఉండగా కుడి, ఎడమ కాలువలకు ఎడా పెడా తోడేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో నాగార్జునసాగర్ తర్వాత రెండో పెద్ద సాగునీటి వనరుగా ఉన్న మూసీ ప్రాజెక్టు నీటిమట్టం వేగంగా అడుగంటుతోంది.

● 6లో.. -(ఆంధ్రజ్యోతి-నాగార్జునసాగర్, కేతేపల్లి)





ధ్వజారోహణం

భేరి పూజ

స్వయంభు యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో బ్రహ్మోత్సవాల రెండో రోజు ఆదివారం ప్రత్యేక పూజలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. అగ్నిప్రతిష్ఠ, ధ్వజారోహణం, దేవతాహ్వానం, భేరిపూజ, హోమాది పూజలను నిర్వహించారు. స్వామివారి తిరుకల్యాణ వేడుకలకు ముక్కోటి దేవతలను ఆహ్వానించేందుకు మహావిష్ణువు ఇష్ట వాహనం గరుత్మంతుడిని ఆహ్వానించేందుకు ధ్వజారోహణం, భేరిపూజ నిర్వహించారు.

● 7లో..

-(ఆంధ్రజ్యోతి-యాదగిరిగుట్ట)

భేరి పూజ నిర్వహిస్తున్న అర్చకులు

గరుడ ముద్దను ఎగురవేస్తున్న అర్చకులు

షూటింగ్ బాల్ సబ్ జూనియర్

ప్రథమస్థానంలో రాష్ట్ర జట్టు



నల్లగొండ జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎన్జీ కళాశాల మైదానంలో నిర్వహించిన సౌత్‌జోన్ షూటింగ్ బాల్ బాలికల సబ్ జూనియర్ విభాగంలో రాష్ట్ర జట్టుకు ప్రథమస్థానం దక్కింది. పలు విభాగాల్లో విజేతలకు షూటింగ్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి జీతురాజ్ తోమర్ బహుమతులు ప్రదానం చేశారు.

● 7లో.. (ఆంధ్రజ్యోతి, నల్లగొండ స్పోర్ట్స్)

తగలబడుతున్నా పట్టించుకోరా?

- అటవీశాఖకు అందుబాటులోలేని ఆధునిక పరికరాలు
- నాగార్జునసాగర్-శ్రీశైలం అభయారణ్యానికి ఫైర్ ఇంజన్ లేక ఇబ్బందులు
- అడవిలో మంటలు చెలరేగితే చెట్ల కొమ్మలు, మట్టితోనే ఆర్పుతున్న సిబ్బంది
- అటవీశాఖలో సిబ్బంది కొరతతో ఇబ్బందులు
- అదనపు సిబ్బందిని నియమించాలి: రాఘవేంద్ర రావు, సాగర్ అటవీ శాఖ రేంజర్

● 6లో..

నిబంధనల మేరకు బియ్యం ఎగుమతి చేయాలి

కలెక్టర్

హాలియా, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఫిలిప్పిన్స్ దేశంతో ఏర్పాటు చేసుకున్న ఒప్పందం మేరకు నిబంధనల ప్రకారం బియ్యం ఎగుమతి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ఆదివారం హాలియాలోని వజ్రతేజ రైస్ క్లస్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ను ఫిలిప్పిన్స్ దేశ క్వాలిటీ కంట్రోల్ అధికారులతో కలిసి బియ్యం నాణ్యతను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, జిల్లా నుంచి సుమారు వెయ్యి మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఎగుమతి చేసేందుకు పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఆదేశించారన్నారు. మిల్లర్ వేగవంతంగా బియ్యాన్ని ఎగుమతి చేయాలని సూచించారు. ఆమె వెంట అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, డీఎం హరీష్, వజ్రతేజ రైస్ క్లస్టర్ ఎండీ చిట్టిపోలు యాదగిరి, హాలియా మిల్లర్స్ జనరల్ సెక్రటరీ పేలపూడి బాలకృష్ణ, తహసీల్దార్ రఘు, డీటీసీఎస్ ముక్తార్, మిల్లు డైరెక్టర్లు చిట్టిపోలు వెంకటేశ్వర్లు, కుక్కడపు రమేష్, చిట్టిపోలు రంజిత్, కొత్త సుదర్శన్, అసోసియేషన్ మేనేజర్ చిత్తనూరి పవన్‌కుమార్, తదితరులు ఉన్నారు.



బియ్యం నాణ్యతను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఫిలిప్పిన్స్ అధికారులు

మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభావతి

మిర్యాలగూడ, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఐద్వా ఆధ్వర్యంలో నిర్వహించనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడగు ప్రభావతి అన్నారు. ఆదివారం మిర్యాలగూడలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పోలెబోయిన వరలక్ష్మితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాల అమలులో విఫలమైందన్నారు. ప్రతీ మహిళలకు రూ.2500 ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయడం లేదన్నారు. కల్యాణలక్ష్మి పథకంలో తులం బంగారం ఇస్తామన్న మాట ఎటు పోయిందని ప్రశ్నించారు. రాష్ట్రంలో మహిళలపై దాడులు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతున్నాయన్నారు. పట్టణాల్లో ఉపాధి పనుల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై రిలే నిరాహార దీక్షలు, ధర్నాలు చేపడ తామన్నారు. ఈ నెల 8న మండల, పట్టణ కేంద్రాల్లో నిర్వహించే మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఐద్వా జిల్లా నాయకులు అరుణ, బీబమ్మ, పూలమ్మ, పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పాలడుగు ప్రభావతి

పెండింగ్ బిల్లులు

మంజూరు చేయాలి

డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య

నల్లగొండ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు, ఉపాధ్యాయుల పెండింగ్ డీఏలు, పీఆర్సీ, ఇతర బిల్లులను వెంటనే మంజూరు చేయాలని డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఖుర్షీద్ మియా అధ్యక్షతన నిర్వహించిన వార్షిక కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. 1వ తేదీనే వేతనాలు చెల్లిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా, ఉపాధ్యాయులు, ఉద్యోగులకు సంబంధించిన బిల్లులు ఏళ్లతరబడి ఈ-కుబేర్‌లో పెండింగ్‌లో ఉంటున్నాయన్నారు. ఉద్యోగ విరమణ చేసిన వారికి చెల్లించాల్సి గ్రాట్యుటీ పెండింగ్‌లో ఉంచుతున్నారని, డీఏ, పీఆర్సీ బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. మార్చి నెలతో ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున బిల్లుల రీటోకెన్ చేయకుండా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి భాస్కర్, జిల్లా కార్యదర్శి పి.వెంకులు, ఉపాధ్యక్షుడు ఠాగూర్ కుమార్, గణేష్, వెంకటేశం, నాగయ్య, ఏడుకొండల్, వెంకటేశ్వర్లు, మోహన్‌రావు, అంజయ్య, ఫిరోజ్ దేశ్‌ముఖ్, యాకుబ్ ఆలీ, సైదులు, జగతి, పుష్ప, లక్ష్మయ్య, పాల్గొన్నారు.

వైభవంగా వీరభద్రస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు

దేవరకొండ, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కమలాపూర్ గ్రామ భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయంలో ఆదివారం బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతాయి. ఆదివారం రుద్ర హోమం, పూర్ణాహుతి, సత్యనారాయణ వ్రతాలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు మార్నాల శ్రీనివాస్‌శర్మ తెలిపారు. 5వరకు వీరభద్రస్వామి ఆలయంలో వ్రతాలు, జాతర ఉత్సవాలు కొనసాగుతాయని తెలిపారు.

తీన్మార్ మల్లన్న టీడీపీలో చేరాలి

మిర్యాలగూడ టౌన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): తీన్మార్ మల్లన్న టీడీపీలో చేరా లని ఆ పార్టీ బీసీ విభాగ రాష్ట్ర నాయకుడు పోగుల సైదులుగౌడ్ కోరారు. ఆది వారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అగ్రకుల పెత్తనమున్న పార్టీలో బీసీలు మనుగడ సాధించడం కష్టత రమన్నారు. సామాన్యప్రజలకు రాజకీయాలను దగ్గర చేసిన పార్టీ టీడీపేనన్నారు. బీసీ నేతలు గౌరవం దక్కని పార్టీలను వీడి పార్టీలో చేరాలని కోరారు.

ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలి



పూజల్లో పాల్గొన్న మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

దామరచర్ల, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని గణేష్‌పాడులో నిర్మించిన హనుమా సీతా సమేత రామలక్ష్మణుల ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ, బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవాల్లో ఆయన పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

పెళ్లి దుస్తుల బ్యాగు అప్పగించిన కండక్టర్

దేవరకొండ, మార్చి 2(ఆంధ్రజ్యోతి): దేవరకొండ నుంచి శనివారం హైదరాబాద్‌కు బయలుదేరిన ఆర్టీసీ బస్సులో ఓ మహిళ ప్రయాణికురాలు పెళ్లి దుస్తుల బ్యాగును మర్చిపోయి వెళ్లింది. దీంతో కండక్టర్ జహిరొద్దిన్ ఆ బ్యాగును గమనించి దేవరకొండ డిపోలో అధికారులకు అప్పగించారు. దీంతో సదరు ప్రయాణికురాలు ఫోన్ ద్వారా విషయాన్ని డీఎం దృష్టికి తీసుకువచ్చింది. ఆయన విచారణ చేసి ఆదివారం ప్రయాణికురాలికి బ్యాగును హైదరాబాద్ బస్సులో కంట్రోలర్ ద్వారా అప్పగించారు. బ్యాగును డిపోలో అప్పగించిన కండక్టర్ జహిరొద్దిన్‌ను ఆర్టీసీ డీఎం తల్లాడ రమేష్‌బాబు, అసిస్టెంట్ మేనేజర్ సైదులుగౌడ్ అభినందించారు.



బ్యాగును అప్పగిస్తున్న ఆర్టీసీ ఉద్యోగి

గిరిజనులు ఐక్యంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న గిరిజన సంఘం నాయకులు

హాలియా, మార్చి 2(ఆంధ్రజ్యోతి): గిరిజనుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ఉండాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొర్ర శంకర్‌నాయక్ అన్నారు. స్థానిక అతిథి గృహంలో టీఆర్‌జీఎస్ సాగర్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి రమావత్ నరేష్‌నాయక్ అధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్‌నాయక్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గిరిజనులకు రావాల్సిన సంక్షేమ పథకాలను, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఆత్మీయ భరోసాలు అర్హులైన వారికి అందే విధంగా సంఘం నాయకులు కృషి చేయాలన్నారు.అనంతరం సంఘం నియోజకవర్గ కోశాధికారిగా సపావట్ పృథ్వీ రాజ్ చౌహన్, ఉపాధ్యక్షుడిగా సపావట్ శివకుమార్, మహిళా అధ్యక్షురాలుగా సపావట్ గులాబీ, దేవరకొండ అధ్యక్షుడిగా ముడావత్ నరేష్‌నాయక్, ఉపాధ్యక్షుడిగా నేనావత్ హాతీరాం, గౌరవ సలహాదారుగా జటావత్ రాములు, అనుముల మండల అధ్యక్షుడిగా మోగావత్ దేవేందర్, పట్టణ అధ్యక్షుడిగా మూడావత్ అంజి, తిరుమలగి మండలాధ్యక్షుడిగా రమావత్ నరేష్, నియోజకవర్గ కమిటీ సభ్యులుగా జటావత్ బద్రునాయక్, పట్టణ ఉపాధ్యక్షులుగా లావూడి రాజేంద్రప్రసాద్, ఆడావత్ అశోక్‌నాయక్, జటావత్ నిమ్మనాయక్, పీఏపల్లి మండలాధ్యక్షుడు రమావత్ అంజి, నేనావత్ మునినాయక్‌కు నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమావత్ జవహర్‌నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు నేనావత్ అశోక్‌నాయక్, కొర్ర రాజు, నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు రమావత్ లాలునాయక్, రమేష్‌నాయక్ పాల్గొన్నారు.

ప్రతిభ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలి

హాలియా, మార్చి 2(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రతిభ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో గుండా కృష్ణమూర్తి, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కోరే రమేష్ అన్నారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్ఎఫ్ఐ జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్ ప్రశ్న పత్రాలను జిల్లా గైడర్ సీహెచ్ లక్ష్మీనా రాయణతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో భ యం, ఆందోళన లాంటివి లేకుండా ధైర్యంగా పరీక్షలు రాయడం కోసం ఈప్రతిభా పరీక్షలు ఉపయో గపడు తాయన్నారు. కార్యక్రమంలో పెద్దవూర, అనుముల మండల కార్యదర్శులు సాయి, వర్షిత్, అంజి, శివ పాల్గొన్నారు.

● తిరుమలగిరి(సాగర్ పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున ఇష్టపడి చదివి మంచి జీపీఏ సాధించాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడు నల్లబెల్లి జగదీష్ అన్నారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో సంఘం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వ హించారు.కార్యక్రమంలో శివ, మధు, గోపి, పాల్గొన్నారు.

● దామరచర్ల :మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. జరగనున్న పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థుల భయాన్ని పోగొట్టడానికి ఎస్ఎఫ్ఐ నిర్వహిస్తున్న ప్రతిభ పోటీల్లో విద్యార్థులు పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి వీరన్ననాయక్, ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర నాయకులు ధీరావత్ శ్రీను నాయక్, ఉపాధ్యాయులు సత్యనారాయణ, జాన్‌పీటర్, శ్రీను, హనుమంతు, శంకర్, నాయకులు చరణ్, శంకర్, హుస్సేన్, సందీప్, భార్గవ్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



హాలియా : ప్రశ్నపత్రాలను విడుదల చేస్తున్న ఎంఈఓ నాయకులు



దేవరకొండలో టాలెంట్ పరీక్షలు నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

● దేవరకొండ : పదోతరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులకు దేవరకొండ ప్రభుత్వ, ప్రైవేట్, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థులకు ప్రతిభ పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులు మొదటిసారిగా కామన్ పరీ క్షలు రాయడానికి సిద్ధమవుతున్న తరుణంలో విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత ను వెలికితీసేందుకే జిల్లాస్థాయిలో టాలెంట్ టెస్టులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బుడిగ వెంకటేష్ గణేష్, శివ, దత్తు, యశ్వంత్ పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

మిర్యాలగూడ టౌన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని యోగా క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు చీదళ్ల వెంకటేశ్వర్లు, కోల సైదులు అన్నారు. తెలంగాణ యోగా ప్రచార సమితి ఆధ్వర్యంలో సూర్యాపేటలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి యోగా సాధన పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలలో నిలిచిన గుడిపాటి కోటయ్య, కంచర్ల శ్రీనివాసరెడ్డిను ఆదివారం అభినందించారు. యోగా, ధ్యాన సాధన మానసిక ప్రశాంతతో పాటు సంపూర్ణారోగ్యం అందిస్తుందన్నారు. పోటీల్లో పట్టణ క్లబ్ సభ్యులు ఉత్సాహంగా పాల్గొని బహుమతులు పొందడం హర్షనీయమన్నారు. అనంతరం సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో బీరవెల్లి సతీష్‌రెడ్డి, ఎన్.దుర్గాప్రసాద్, పయిడి సురేష్, కర్నాటి శేఖర్, ఆలంపల్లి శ్రీనివాస్, నాగయ్య, లక్ష్మయ్య, రాచయ్య పాల్గొన్నారు.



యోగా క్లబ్ సభ్యులను అభినందిస్తున్న అధ్యక్ష, కార్యదర్శులు

ఉచిత వైద్య శిబిరం అభినందనీయం : సీఐ



కొండమల్లేపల్లి: పరీక్షలు చేస్తున్న వైద్యాధికారులు

హాలియా, మార్చి 2(ఆంధ్రజ్యోతి): పేదలకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని హాలియా సీఐ జనార్ధన్‌గౌడ్ అన్నారు. ఆదివారం హాలియా మున్సిపాలిటీలోని ఆదిత్య కేర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన గుండె వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఇటీవల కాలంలో గుండె జబ్బు లు విపరీతంగా పెరిగాయని, వారికి వెంటనే సీపీఆర్‌ను చేయడం ద్వారా మనిషి ప్రాణాలను కాపాడే అవకాశం ఉందన్నారు. శిబిరంలో భాగంగా 500 మందికి వివిధ పరీక్షలు మందులను పంపిణీ చేశారు. ఆర్యవైశ్య సంఘం నాయ కులు మిట్టపల్లి కిరణ్, చీదళ్ల లింగయ్య సహకారంతో రాగిజావా, పండ్లను పంపిణీ చేశా రు. కార్యక్రమంలో ఆదిత్యకేర్ ఎండీ డాక్టర్ నులక రవీందర్‌రెడ్డి, డాక్టర్లు రాఘ వేందర్‌రెడ్డి, పథ్వీ రెడ్డి, హార్థిక్, పవన్‌తేజ, ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు.

● కొండమల్లేపల్లి :హైదరాబాద్‌లోని మలక్‌పేట యశోద ఆస్పత్రి సౌజన్యంతో పస్నూరి యుగేందర్‌రెడ్డి సహకారంతో కొండమల్లేపల్లిలో ఆదివారం మేగా వైద్యం శిబిరం నిర్వహించారు. 20 మంది వైద్యులతో వైద్య పరీక్షలు నిర్వహించగా 202 మంది వైద్య శిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ మేరకు అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో కొమ్మినేని ఆంజనేయులుయాదవ్, మలక్‌పేట యశోద హాస్పిటల్ సీనియర్ మేనేజర్ వాసు, కిరణ్‌రెడ్డి, క్యాంప్ ఇన్‌చార్జి శ్రీను, వైద్య బృందం పాల్గొన్నారు.

నియమ నిష్టతతో ఉపవాస దీక్షలు కొనసాగించాలి

డిండి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): రంజాన్ మాస ఉపవాసదీక్షలు ముస్లింలు నియమ నిష్టతతో కొనసాగించాలని దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. స్థానిక ఎర్రారం గ్రామంలో ముస్లిం పేద కుటుంబాలకు రంజాన్ ప్రారంభం సందర్భంగా తోఫా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవిత్రమైన రంజాన్‌మాసంలో ముస్లింలు నియమ నిష్టలతో కూడిన ఉపవాస దీక్షను కొనసాగించాలని అన్నారు. అనంతరం డిండి మండల కేంద్రంలోని గంగమ్మ ఆలయంలో బోనాల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొంతినేని వెంకటేశ్వరరావు, సిరాజ్‌ఖాన్, అబ్దుల్ ఖదీర్, యూనిస్, ఎండీ.అక్రం, షఫీ, గుర్రం రాములు, పోలం లక్ష్మణ్, మేకల కాశయ్య, గడ్డమీది సాయి, పోల వెంకటేష్, వావిల్ల సలయ్య, కలీం, పోలం శ్రీను, సుధాకర్, తీజ్, కిన్నెర హరికృష్ణ పాల్గొన్నారు.



డిండి : ఎర్రారంలో తోఫా అందజేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

మిర్యాలగూడ : నెలరోజులు కఠోర నియమాలు పాటిస్తే ముస్లింలు అల్లా అనుగ్రహాన్ని పొందవచ్చునని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. రంజాన్ సందర్భంగా మిర్యాలగూడ సీతారాంపురం చిన్న మజీద్‌లో ఉపవాసదీక్షల ప్రారంభోత్సవంలో ఆదివారం ఆయన పాల్గొని ప్రత్యేక నమాజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసంలో ముస్లింలు కఠినమైన ఉపవాసదీక్షలతో అల్లాను స్మరించుకుంటారని అన్నారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

సహర్, ఇఫ్తార్ ఏర్పాటు హర్షనీయం

మిర్యాలగూడ టౌన్ : రంజాన్ సందర్భంగా విద్యార్థులకు సహర్, ఇఫ్తార్ ఏర్పాటు చేయడం హర్షనీయమని మైనార్టీ విభాగ నాయకులు ఎండీ. ఖాజాహమీదుద్దీన్, ఎండీ అస్లాం అన్నారు. రాష్ట్ర మైనార్టీ పాఠశాలల ఆధ్వర్యంలో రూపొం దించిన రంజాన్ కాలమానిని ఆదివారం సరేయా మీరాలాం మసీదులో ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ రంజాన్ మాస ప్రాముఖ్యతను గుర్తించి కాలమానిని ప్రచురించడం ఉపయోగకరమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, విద్యాసంస్థల చైర్మన్ ఫహీంకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ అరుణ, మత పెద్దలు మునల్లియా న్, జహంగీర్, సమీఖాద్రి, ఆరీఫ్, మౌలానా, మోయిజ్, ఖాదర్ పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డులో కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలి : ఏఐటీయూసీ

డిండి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): సంక్షేమ బోర్డులో కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలని ఏఐటీయూసీ భవన నిర్మాణ కార్మిక సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లా దేవేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కందుకూరు గ్రామంలో ఆదివారం నిర్వహించిన భవన నిర్మాణ కార్మిక సంఘం 8వ మండల మహాసభలో ఆయన మాట్లాడారు. కొన్ని నెలలుగా కార్మికులకు నగదు చెల్లింపులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో కార్మికశాఖ వైఫల్యం చెందిందని ఆరోపించారు. సాంకేతిక సమస్యలు చూపి ఆరు నెలలుగా కార్మికులను కార్యాలయం చుట్టు తిప్పుకుంటు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. ఎన్నో పోరాటాల ఫలితంగా సాధించుకున్న సంక్షేమ బోర్డు సమస్యల నిలయంగా మారిందన్నారు. సమావేశంలో వెంకటరమణ, నూనె రామస్వామి, ఎండీ.మైనొద్దిన్, నూనె వెంకటేశ్వర్లు, లింగమయ్య, దేవయ్య పాల్గొన్నారు.



కార్మికుల మహాసభలో మాట్లాడుతున్న పల్లా దేవేందర్‌రెడ్డి

విద్య, ఉపాధితోనే సామాజిక అభివృద్ధి

హాలియా, మార్చి 2(ఆంధ్రజ్యోతి): విద్యా, ఉపాధి కల్పన ద్వారానే సామాజిక అభివృద్ధి సాధ్యమని ఏకే ఫౌండేషన్ చైర్మన్ కట్టెబోయిన అనిల్‌కుమార్ అన్నారు. స్థానిక శ్లోక పాఠశాలలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాబ్ మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత అభివృద్ధికి ఏకే ఫౌండేషన్ ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. జాబ్ మేళాకు సాగర్ నియోజ కవర్గం, మిర్యాలగూడ, దేవరకొండ, నల్లగొండ ప్రాంత యవకులు పాల్గొనగా వారికి క్వస్ క్రాఫ్, ఫోక్సకాన్ కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. అనంతరం ఎంపికైన 50 మంది అభ్యర్థులకు ఫౌండేషన్ చైర్మన్ అనిల్‌కుమార్ నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు సునీల్‌రావు, రాధిక, రాజిరెడ్డి, ఉపాధ్యాయులు రాజేష్, తుమ్మరకోటి రమేష్, ఫౌండేషన్ సభ్యులు మన్నెం కోటి, మోకరాల అనిల్, మేకల మహేష్‌యాదవ్, శేఖర్‌గౌడ్, రావుల రాము,మోహన్‌చారి, గంగుల అంజి, చరణ్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన వారితో ఫౌండేషన్ చైర్మన్ అనిల్‌కుమార్, నిర్వాహకులు

గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

చింతపల్లి, మార్చి2(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో నెలకొన్నతాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి ఉడుకుంట్ల రాములు అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కుర్మేడ్‌తో పాటు, పలు గ్రామాల్లో నిత్యం మిషన్‌భగీరథ నీరు సరఫరా కాకపోవడంతో మహిళలు బిందెడు నీటి బండెడు కష్టాలు పడాల్సిన దుస్థితి నెలకొందన్నారు. అధికారులు స్పందించి గ్రామాల్లో పర్యటించాలన్నారు. వేసవి సమస్య మరింత జఠిలం కాకుండా పరిష్కరించాలన్నారు.

ప్రజల వెంట నడిచినవారే కమ్యూనిస్టులు



శ్రీనివాసరెడ్డి స్థూపంవద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ప్రజలే ఎజెండాగా వారితో కలిసి నడిచినవారే నిజమైన కమ్యూనిస్టులని మాజీ ఎమ్మెల్యే, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. సీపీఎం నేత గాదె శ్రీనివాసరెడ్డి 43వ వర్థంతి సందర్భంగా ఆయన స్థూపం వద్ద నివాళులర్పించి మాట్లాడారు. ప్రజా సమస్యలే పోరాట జెండాలుగా చేసి దోపిడీ నేతల గుండెల్లో దడ పుట్టించిన శ్రీనివాసరెడ్డిని రాజకీయంగా ఎదుర్కోలేక భౌతికంగా ఆయనను హత్య చేశారని అన్నారు. ఎందరో నేతల త్యాగాల వల్లే నేటికి ఎర్రజెండాను పేదల తమకు అండగా భావిస్తున్నారని అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారసత్వంతో భూమి, విముక్తి పోరాటాల వారసత్వాన్ని కొనసాగిస్తూ కమ్యూనిస్టులు ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తూ వస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, మల్లుగౌతం రెడ్డి, శ్రీనివాసరెడ్డి సహచరి గాదె పద్మ, పిల్లుట్ల సైదులు, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పెద్దవూర, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 2010-11 విద్యా సంవత్సరంలో పదోతరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు పాఠశాలలో తాము గడిపిన గత స్మృతులను నెమరువేసుకోని ఆహ్లాదంగా గడిపారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం నర్సిరెడ్డి, ఉపాధ్యాయులు విజయారెడ్డి, వెంకన్న, ప్రభాకర్, కొండల్, శ్రీహరి, సతీష్, సంతోషి, మంజుల, రమేష్ పాల్గొన్నారు.

● కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని సిద్దార్థ హైస్కూల్ తెలుగు మీడియం 2000-01 సంవత్సరం పదోతరగతి విద్యార్థులు ఆదివారం కొండమల్లేపల్లిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. తమకు విద్యా బుద్ధులు నేర్పిన గురువులను సన్మానించుకున్నారు. ఈ సందర్భంగా తమ పాఠశాల నాటి అనుభవాలను నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం చిట్టెడి ప్రభాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, శ్రీనివాస్, చంద్రమౌళి, చక్రాధర్, రామకృష్ణ, యాదయ్య, పూర్వ విద్యార్థులు రూపేందర్, నాయిని అనిల్‌రెడ్డి, రమావత్ రాములునాయక్, జంంగయ్య, బూడిద శ్రీనివాస్‌యాదవ్, వీరబోయిన రామాంజనేయులు, మణిపాల్‌రెడ్డి, చెన్నగోని సుధాకర్, గీత, స్వాతి, షమీమ్, విజయలక్ష్మి, అనిత, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.



కొండమల్లేపల్లిలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



పెద్దవూరు : పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

రేపు రథోత్సవం

చింతపల్లి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని నెల్వలపల్లి గ్రామంలోని మల్లికార్జునస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రథోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లుఆలయ కమిటీ పూజారి గొట్టి ముక్కల నరసింహశర్మ ఆదివారం తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు అన్ని వసతి సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

● పొలాలను కాపాడాలని రైతుల ధర్నా

నకిరేకల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): సాగునీటి అందించి పంట పొలాలను కాపాడాలని పలువురు రైతులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ఎల్-11 తూము వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పానగల్ ఎస్ఎల్‌బీసీ డీ-40 కాల్వ ద్వారా ఎల్- 11 తూము నుంచి నకిరేకల్ మండలం గోరెంకలపల్లి, మోదినిగూడెం, తిప్పర్తి మండలంలోని మామిడాల, ఇండ్లూరు, దూపలగూడెం, సర్వారం, గుర్రప్పగూడెం, మోత్కూరు, బుసిరెడ్డిగూడెం గ్రామాలకు చెందిన రైతు లు ఎల్-11 తూము వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వానాకాలం నుంచి డీ-40 కాల్వ ద్వారా సాగునీరు వదలడం లేదని, నీటిని వదిలి తమ పంట పొలాలను కాపాడాలని రైతులు డిమాండ్ చేశారు. పదేళ్లలో తూములకు గేటు ఏర్పాటు చేయలేదని, ఎల్ -11 తూము వద్ద ఎం దుకు గేటు ఏర్పాటు చేశారని వారు ప్రశ్నించారు. తూముకు వేసిన గేటును తొలగించి నీటిని విడుదల చేయాలని రైతులు డిమాండ్ చేశారు.